



శ్రీ దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుద్ధ పంచమి శనివారం ఏలూరు సత్రం పాడులోని అంబికా దేవిని శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. జిల్లా వ్యాప్తంగా అమ్మ వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమ పూజలు చేశారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

- ఈసారి లక్ష్యం నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు
- సన్నరకాలు కూడా కొనుగోలు చేయాలని నిర్ణయం
- 261 ఆర్ఎస్‌కేల్లో ఏర్పాట్లు
- 70 లక్షల గోనె సంచులు సిద్ధం
- అక్టోబరు మూడో వారం నుంచి ప్రారంభం
- ఆర్ఎస్‌కేలలో క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్

ఏలూరుసిటీ, సెప్టెంబరు 27(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. అక్టోబరు చివరి వారానికి ధాన్యం మాసూళ్ల ప్రారంభించే అవకాశం ఉండడంతో ఈ సారి అక్టోబరు మూడోవారం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను 261 ఆర్ఎస్‌కే కేంద్రాల ద్వారా చేయాలని నిర్ణయించారు. వీటికి అనుబంధంగా 130 సహకార సంఘాలు ధాన్యం కొనుగోళ్లలో ప్రధాన పాత్ర వహించనున్నాయి. జిల్లాలో లక్షా 91వేల 534 ఎకరాల్లో సాగు జరగ్గా 5 లక్షల 75వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇది గతేడాది లక్ష్యం కంటే ఎక్కువ. గతేడాది ఖరీఫ్‌లో రూ.808 కోట్ల విలువైన 3,53,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 43,818 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి పూర్తి స్థాయిలో చెల్లింపులు చేశారు. రబీలో రూ.583 కోట్లు విలువైన 2,53,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 20,530 మంది రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈసారి సన్నరకాలైన బీపీటీ 5204, ఎంటీయూ 1224, 1262 రకాలను కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. గతంలో ఉన్న గోనెసంచుల కొరత రాకుండా ఇప్పటికే 70 లక్షల గోనె సంచులను సిద్ధం చేశారు. ఖరీఫ్ ధాన్యం సేకరణపై ముందస్తు ప్రణాళికపై అధికారులకు జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి దిశానిర్దేశం చేశారు. మండల స్థాయిలోను ధాన్యం సేకరణ పై సమావేశాలు నిర్వహించి అక్టోబరు మొదటి వారంలో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు.



కొత్తగా క్యూఆర్‌కోడ్ బ్యాక్‌అప్ మెకానిజం

ఈసారి స్మార్ట్ రైస్ కార్డులలో ఇచ్చిన మాదిరిగానే ధాన్యం కొనుగోలు చేసే రైతు సేవా కేంద్రాల వద్ద క్యూఆర్ కోడ్ బ్యాక్ అప్ మెకానిజంను ఏర్పాటు చేస్తున్నారు. రైతులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలపవచ్చు. గోనె సంచులు (మిగతా 10వ పేజీలో)

మానవీయ కోణంలో పరిష్కరించండి

- నిబంధనల పేరుతో కొల్లేరు ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు
- త్వరలో మరో ఉన్నతస్థాయి సమావేశం.. నివేదికలతో రండి..
- అమరావతిలో కొల్లేరుపై మంత్రి నాదెండ్ల సమీక్ష.. అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- ఏలూరు జిల్లా సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు

ఏలూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'కొల్లేరు ప్రజలను నిబంధనల పేరుతో ఇబ్బంది పెట్టొద్దు. ఇక్కడ ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించడానికి అటవీ శాఖ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి' అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో కొల్లేరు అటవీ భూములు, ఇతర నియోజకవర్గాల్లోని అటవీ సమస్యలపై ఎమ్మెల్యేలు ఆందోళన స్వరం వినిపించారు. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్షిస్తామని మంత్రి నాదెండ్ల అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే శనివారం అమరావతి సచివాలయంలో జిల్లాకు చెందిన మంత్రి పార్థసారథితోపాటు, ఎమ్మెల్యేలు, అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు.

మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ 'కొల్లేరు ప్రజలకు తాగు నీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అటవీ సహా ఇతర శాఖలు నిబంధనల పేరుతో అడ్డుపడడం సమంజసం కాదు. కొల్లేరు అటవీ భూముల సరిహద్దుల సమస్యలపై చర్యలు తీసుకోవాలి. అటవీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. త్వరలోనే ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తాం. దీనికి పరిష్కార మార్గాలు, చర్యలతో కూడిన పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలి' అంటూ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, చిత్రంలో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు వెంకటరాజు, చంటి, ధర్మరాజు, రోషన్‌కుమార్, బాలరాజు, కామినేని

సరిహద్దులు నిర్ణయించండి : కొలుసు

- తన నియోజకవర్గంలో అటవీ భూములకు సరిహద్దుల సమస్య ఉందని, రెవెన్యూ, ఫారెస్టు అధికారులకు సంయుక్తంగా పరిశీలించి సరిహద్దులను నిర్ణయించాలని మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ భూములకు రైతులకు పట్టాలు జారీ చేయాలని కోరారు.
- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ విషయంలో నిర్వాసితులకు అటవీ శాఖ అధికారులకు మధ్య వచ్చిన సమస్యలను సామరస్య పూర్వక వాతావరణంలో పరిష్కారం అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు.

సమస్యలు పరిష్కరించండి

- కొల్లేరు లంక గ్రామాల్లో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ ప్రజల సమస్యపై మానవతా దృక్పథంతో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచించారు.
- ఏలూరు రూరల్ మండలం మొండికోడు రోడ్డు మరమ్మతులకు అనుమతి మంజూరు చేయాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు.
- తన నియోజకవర్గంలో 64 నోటిఫైడ్ డ్రెయిన్ల మరమ్మతులకు నిధులు మంజూరుచేయాలని, డ్రెయిన్లను ఏటా డీసిల్టింగ్ చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు.
- ఏలూరులో వున్న నగర వనానికి ప్రత్యామ్నాయంగా వేరే విశాల ప్రదేశంలో ఏర్పాటు చేయాలని అటవీ శాఖను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి కోరారు.
- వెదురు మొక్కల పెంపకానికి మొక్కలు పంపిణీ చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కోరారు.
- తన నియోజకవర్గంలో అటవీ భూముల సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ కోరారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన బాట!

- పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటా తగ్గింపు, పరిమితులపై నిరసనలు
- ల్యాబ్ టెక్నీషియన్ల మద్దతు
- గ్రామాల్లో వైద్యసేవలకు విఘాతం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): పీజీ వైద్యవిద్య క్లినికల్, నాన్ క్లినికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇన్‌సర్వీస్ కోటా సీట్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యాధికారులు దశల వారీ ఆందోళనబాట పట్టారు. శుక్రవారమే ప్రారంభమైన ఈ ఆందోళనలో భాగంగా శనివారం రెండోరోజు నుంచి క్రమేణా ఉధృతిని పెంచుతూ కేవలం పీహెచ్‌సీ అవుట్ పేషెంట్ (ఓపీ) విధులకే పరిమితమయ్యారు. ఫలితంగా గ్రామాల్లో నిర్వహించాల్సిన ఫ్యామిలీడాక్టర్ కాన్సెప్ట్, సంచార వైద్యచికిత్స, స్వచ్ఛనారీ, ప్రత్యేక వైద్య శిబిరాల వైద్యసేవలు నిలిచిపోయాయి. ఆదివారం నుంచి ఆందోళనను మరింత పెంచడానికి ఏపీ పీహెచ్‌సీల వైద్యుల సంఘం ఇచ్చిన షెడ్యూలు మేరకు జిల్లాలో వైద్యాధికారులు వ్యవహరిస్తారని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఆర్. గంగాభవాని, డాక్టర్ షేక్ జోషిమా వెల్లడించారు. కాగా వైద్యాధికారుల ఆందోళనవల్ల జిల్లాలో గ్రామీణప్రాంత రోగులకు ఇప్పటికిప్పుడు ఇబ్బందేమీ కలుగలేదని, ప్రభుత్వ సూచనలమేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వైద్యసేవలకు ఎటువంటి విఘాతం లేకుండా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం తెలిపారు.

ఆందోళన కార్యారణ ఇలా..

జిల్లావ్యాప్తంగా 62 పీహెచ్‌సీలున్నాయి. ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున వైద్యాధికారులు విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రతీ పీహెచ్‌సీకి రోజుకు సగటున 80 నుంచి 150 మంది వరకు రోగులు వస్తుంటారు. శనివారం నుంచి 104 వాహనాల్లో సంచారవైద్యసేవ, ఫ్యామిలీ డాక్టర్, తదితర గ్రామీణ ప్రాంతాలకెళ్లి అందించే వైద్య సేవలన్నీ నిలిపివేయగా, ఆదివారం వైద్యఆరోగ్య శాఖ అధికారిక విధులు, క్షేత్రస్థాయిలో వైద్య సేవలు, వాటిని నమోదు చేయడం, ప్రభుత్వ ఆరోగ్యపథకాల అమలు, పర్యవేక్షణ వంటివి పర్యవేక్షించేందుకు ఉద్దేశించిన వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలగుతారు. సోమవారం నుంచి అత్యవసర వైద్యసేవలైన డెలివరీలు, పాము కాటు, పాయిజనింగ్, రోడ్డుప్రమాదాలు వంటి కేసులకు మాత్రమే పరిమితమై, ఓపీ కేసులను బహిష్కరిస్తారు. ఈ నెల 30న జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ఆందోళన శిబిరాన్ని ప్రారంభించి, డాక్టర్లందరూ నిరసనలో పాల్గొంటారు. అక్టోబరు 1న ర్యాలీలు, 2న వైద్యాధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గం విజయవాడలో తీసుకునే కార్యాచరణను బట్టి తదుపరి దశ ఆందోళనను ఉధృతం చేస్తారు. పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న డాక్టర్లకు టైంబౌండ్‌తో కూడిన పదోన్నతులు ఇవ్వాలని కోరుతున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న వైద్యులకు రెండేళ్లకే సివిల్ సర్జన్లుగా ప్రమోషన్లు వస్తుండగా, డైరెక్టర్ ఆఫ్ (మిగతా 10వ పేజీలో)



చాట్రాయి పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యాధికారులు

డిమాండ్లు ఇవీ..

కొవిడ్ మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగాపెట్టి వైద్యసేవలందించిన డాక్టర్ల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని పీహెచ్‌సీల వైద్యాధికారులు వాపోతున్నారు. పీజీ అడ్మిషన్లలో ఇన్ సర్వీస్ కోటా కింద సీట్లు లభిస్తాయనే ఆశతోనే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పీహెచ్‌సీల్లో ఏళ్ల తరబడి వైద్య సేవలందిస్తున్నామని చెబుతున్నారు. దీనికనుగుణంగానే ప్రభుత్వం పీజీ వైద్యవిద్య అడ్మిషన్లలో ఇన్‌సర్వీస్ కోటా కింద పీహెచ్‌సీల వైద్యుల (ఎంబీబీఎస్)కు క్లినికల్ కోర్సుల్లో 30 శాతం, నాన్ క్లినికల్ కోర్సుల్లో 50 శాతంగా వున్న సీట్లను కొనసాగించాలని గతేడాది రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీల వైద్యులు సమ్మె చేసినా పట్టించుకోకుండా క్లినికల్ కోర్సులకు 20 శాతానికి, నాన్ క్లినికల్ కోర్సులకు 30 శాతానికి ఏకపక్షంగా తగ్గించేసిందని వివరించారు. ఈ ఇన్‌సర్వీస్ కోటా సీట్లను మళ్లీ ఈ ఏడాది మరింత తగ్గిస్తూ 7 క్లినికల్ కోర్సులకు 15 శాతం సీట్లను పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోవున్న ఇన్‌సర్వీస్ కోటాను సవరిస్తూ జారీచేసిన జీవో 99 ఉత్తర్వులను ఉపసంహరించుకుని పాతకోటా విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్ కోటాను ఏటా మార్చకుండా రాబోయే సంవత్సరాలకు వర్తించేలా పారదర్శకతతో కూడిన ఏకీకృత విధానాన్ని ప్రభుత్వం ప్రకటించాలని కోరుతున్నారు.

ఎస్టీ సర్టిఫికెట్ ఎందుకివ్వరు..?

నాయక కులస్తుల ఆవేదన..
వారం రోజులుగా నిరసన

కామవరపుకోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట పంచాయతీ కొండగూడెంలోని నాయక కులస్తులకు గతంలో 2014 వరకు ఎస్టీ సర్టిఫికెట్‌లు ఇచ్చారు. రాష్ట్ర విభజన అనంతరం వీరికి ఎస్టీ సర్టిఫికెట్‌లు ఇవ్వలేదు. దీంతో నాయక కులస్తులు తాము తరతరాలుగా ఈ ప్రాంతంలో ఉంటున్నామని, మా తాత ముత్తాతలు ఎస్టీ జాతిలోనే ఉన్నారని, అందుకు సంబంధించిన సర్టిఫికెట్ లు చూపించినా అధికారులు పట్టించుకోవడం లేదని కులస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కామవరపు కోట పరిసర గ్రామాల్లో సుమారు 1500 మంది వరకు నాయక కులస్తులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోను గతంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయడంతో పాటు రాష్ట్ర నాయకుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం అప్పటి ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో కమిషన్ వేసి నివేదిక ఇవ్వాలని కోరింది. పీవో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్థులతో చర్చలు జరిపారు. ఆ తరుణంలో నాయక కులస్తులంతా తమ వద్ద ఉన్న ఆధారాలు, ఎస్టీ జాతికి చెందినవారమని తెలిపే వివరాలు, గతంలో ఇచ్చిన సర్టిఫికెట్‌లు చూపించినా ఇప్పటి వరకు తమకు సర్టిఫికెట్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు.

శాసనసభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే సొంగా

తమ సమస్యను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ దృష్టికి నాయక కులస్తులు తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంతంలో నివసించే నాయక కులస్తులకు ఎస్టీ సర్టిఫికెట్‌లు ఇచ్చే విషయంలో ప్రతిష్ఠంబన తొలగించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

వారం రోజులగా నిరసన దీక్షలు

విద్య, ఉపాధి అవకాశాల కోసం తమ నాయక కులస్తులకు ఎస్టీ సర్టిఫికెట్‌లు ఇవ్వాలని కోరుతూ వారం రోజులుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహిస్తున్నారు. నాయక కులస్తులైన గోధుమ, నల్లమోతుల, పిక్కిలి, బోగ్యం వర్గాలకు చెందిన వారికి ఎస్టీ సర్టిఫికెట్‌లు ఇచ్చి విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. గతంలో సర్టిఫి కెట్‌లు ఇచ్చి ఇప్పుడు ఎందుకివ్వరంటూ ఆక్రోశాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమకు సర్టిఫికెట్‌లు మంజూ రు చేసే వరకు ఆందోళన విరమించేదిలేదని నాయక కులస్తులు గోధుమ మధు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రాజారావు స్పష్టం చేశారు.



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న నాయక కులస్తులు



ఆదిసేవా కేంద్రం ఆవరణలో మొక్కను నాటుతున్న కలెక్టర్

గిరిజన గ్రామాలకు ఆది కర్మయోగి పథకం వరం

కలెక్టర్ వెట్రిసెల్వి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 27(ఆంధ్ర జ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధికి ఆది కర్మయోగి అభియాన్ పథకం వరం వంటిదని కలెక్టర్, ఐటీడీఏ చైర్మన్ కె.వెట్రిసెల్వి అన్నారు. ఆదిసేవా కేంద్రంలో శనివారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రాజానగరం ఆదిసేవా కేంద్రంలో గిరిజనులతో మాట్లాడారు. అక్టోబరు 2వ తేదీన ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి అవసరమైన సదుపాయాలపై తుది ప్రణాళికలను తయారు చేయాలని ఆదేశించారు. పీవో కె.రాములు నాయక్, ఆర్డీవో ఎంవీ రమణ, డీడీ శ్రీవిద్య, డీఎంహెచ్‌వో డా.పీజే అమృతం పాల్గొన్నారు.

పదోన్నతులకు తాత్కాలిక సీనియారిటీ జాబితా సిద్ధం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 27(ఆంధ్ర జ్యోతి): కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సహోపాధ్యాయుల పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేయడానికి ఎస్.జి.టి. ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాను తయారు చేసినట్టు ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు. సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే అక్టోబరు 3వ తేదీ లోపుగా ఐటీడీఏ పీవో లేదా డీడీలకు తెలపాలన్నారు. అభ్యంతరాలను పరిశీలించి సీనియారిటీ జాబితాను ప్రకటించి అక్టోబరు 3న పదోన్నతుల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇన్‌చార్జి డీడీ శ్రీవిద్య పాల్గొన్నారు.

పోటెత్తుతున్న గోదావరి

- వేలేరుపాడు మండలంలో 23 గ్రామాలకు రాకపోకలు బంద్



కుక్కునూరు-దాచారం మార్గంలో గోదావరి వరద ఉధృతి

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం,సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద పోటెత్తుతోంది. గత మూడు నెలల్లో ఇది ఐదోసారి. భద్రాచలం వద్ద శనివారం సాయంత్రానికి 44.6 అడుగులుగా నీటిమట్టం నమోదవగా దిగువకు 10 లక్షల క్యూసెక్కుల నీరురావడంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పలుగ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. శనివారం సాయంత్రానికి పలు గ్రామాలకు వెళ్లే రహదారులు నీటమునిగిపోవడంతో 23 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరదభయం తప్పిపోయిందన్న భరోసాతో గత 15 రోజుల నుంచి రైతులు మిరప పంటను వేశారు. అయితే మరల వరద రావడంతో వేలేరుపాడు మండలంలో 200 ఎకరాల్లోని మిరప పంట నీటమునిగిపోవడంతో రైతులకు నష్టం కలిగింది. కుక్కునూరు మండలంలో 150 ఎకరాల్లో మిరప పంట వేశారు. గోదావరి మరింత పెరిగితే పంట నీటమునిగే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం పెరి గింది. పాత పోలవరం వద్ద కడెమ్మ స్లూయిజ్ గేట్లు వరద నీటిలో మునగడంతో ఏటి గట్టుకి కుడి వైపు ఉన్న కొవ్వాడ కాలువ జలాలు గోదావరిలోకి వెళ్లే మార్గం లేక పంట పొలాలు క్రమక్రమంగా మూడోసారి నీట మునుగుతున్నాయి.

వాయుగుండం .. భారీవర్షాలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా శనివారం సాయంత్రం నుంచి జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో ఆదివారం వరకు భారీగా వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 60 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 14.7 మి.మీగా నమోదైంది. జంగారెడ్డిగూడెం 35.6, కామవరపుకోట 35.2, పెదవేగి 33.2, బుట్టాయిగూడెం 30.8, టి.నరసాపురం 25, కుక్కునూరు 24.6, ముసునూరు 23.2, కొయ్యలగూడెం 18.4, జీలుగుమిల్లి 15.8, చింతలపూడి 14.2, పోలవరం 13, ఉంగుటూరు 10, భీమడోలు 8.2, నూజివీడు 7.8, లింగపాలెం 7.8, దెందులూరు 7.2, ఆగిరిపల్లి 5.8, ద్వారకా తిరుమల 5.2, కలిదిండి 5.2, చాట్రాయి 4.4, పెదపాడు 3.6, ముదినేపల్లి 3.4, మండవల్లి 3.2, నిడమర్రు 3, ఏలూరు అర్బన్ 3, కైకలూరు 2.6, ఏలూరు రూరల్ 2.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

విద్యుత్ శాఖ అప్రమత్తం.. కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించేందుకు (మిగతా 10వ పేజీలో)



బడేటి చంటి



విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలరాజు

గిరిజన సంక్షేమ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యేలు చంటి, బాలరాజు

ఏలూరు టూటౌన్/జీలుగుమిల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ కమిటీ సభ్యులుగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజనులకు విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కృషి చేయడానికి వీలు ఏర్పడిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే బాలరాజు కలిసి పోలవరం అభివృద్ధికి, పాఠశాల భవనాల నిర్మాణం, ఏజెన్సీ ప్రాంత గిరిజన విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ఉన్నారు.

లలితా త్రిపుర సుందరీదేవి నమోస్తుతే



ద్వారకాతిరుమలలో లలితాత్రిపుర సుందరిగా కుంకుళ్లమ్మ

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో అమ్మవారి ఆలయాల వద్ద దేవీనవరాత్రుల్లో భాగంగా శనివారం ఆరో రోజు ఆలయాల్లో అమ్మవార్లు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి దేవి పంచాయతన క్షేత్రంలో అమ్మవారు స్కంద మాత అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

రేపు వీరంపాలెంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి దేవి క్షేత్రంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తామని వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాల కోసం భారీగా తరలిరానున్నట్టు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.

భవానీ దీక్షా పీఠంలో కుంకుమ పూజలు

తణుకు : సజ్జాపురంలోని శ్రీ అఖిల భారత భవాని దీక్షా పీఠంలో శనివారం ప్రత్యేక కుంకమ పూజలు నిర్వహించారు. దీక్షా పీఠం వ్యవస్థాపకులు శ్రీ శివరామకృష్ణ స్వామీజీ, కృష్ణవేణి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం 108 కలశాలతో అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్ర నామాలతో భవానీ దీక్షాపరులతో నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భవానీలు పాల్గొన్నారు.



వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి దేవికి పూజలు చేసిన వెంకటరమణ సిద్ధాంతి



భీమవరంలో లలితా త్రిపురదేవి అలంకరణలో మావుళ్లమ్మ



సత్రంపాడులో లలితా త్రిపుర సుందరిదేవిగా సౌభాగ్యలక్ష్మి



జంగారెడ్డిగూడెంలో లలితా త్రిపుర సుందరి దేవిగా గంగానమ్మ



విశేష అలంకరణలో రాట్నాలకుంట రాట్నాలమ్మవారు



తణుకు-సజ్జాపురంలోని అఖిల భారత భవానీ దీక్షా పీఠంలో కుంకుమ పూజలు



పాలకొల్లులో రాజరాజేశ్వరి దేవి అలంకరణలో కనక దుర్గమ్మ



పెనుగొండలో లలితా త్రిపుర సుందరి దేవిగా వాసవీ మాత



ఆకివీడులో లలితాత్రిపుర సుందరిదేవిగా పెద్దింట్లమ్మ



దుర్గమ్మకు పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ట్రస్టీ నివృతరావు, ఈవో మూర్తి



ద్వారకాతిరుమలలో ఎంపీ పుట్టాను సత్కరిస్తున్న సంఘనేతలు

మార్మోగిన గోవింద నామస్మరణ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): శ్రీవారి క్షేత్రంలో గోవింద నామస్మరణ మార్మోగింది. వేలాదిగా భక్తులు చినవెంకన్న క్షేత్రానికి చేరుకున్నారు. స్వామికి ఇష్టమైన రోజు శనివారం ద్వారకాతిరుమల ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం సాయంత్రం నుంచే ఆలయానికి పాదయాత్ర భక్తుల రాక ప్రారం భమైంది., దాదాపు 20 వేల మంది వరకు భక్తజనులు స్వామి, అమ్మవార్లను దర్శించి నట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటల పైబడి సమయం పట్టింది.

దుర్గమ్మకు పట్టువస్త్రాలు అందించిన చినవెంకన్న..

చినవెంకన్న దేవస్థానం నుంచి విజయ వాడ ఇంద్రకీలాద్రి దుర్గమ్మకు శనివారం పట్టువస్త్రాలు అందాయి. ఈమేరకు విజయవాడలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గాదేవికి ద్వారకా తిరుమల ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి అక్కడి అధికారులకు పట్టువస్త్రాలను అందజేశారు.

యాదవ కల్యాణ మండపం అభివృద్ధికి రూ.కోటి

ఏలూరు ఎంపీ పుట్టా ప్రకటన

ద్వారకాతిరుమలలోని యాదవ కల్యాణమండపం అభివృద్ధికి కోటి రూపాయలను ఎంపీ నిధుల నుంచి కేటాయిస్తున్నట్టు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ప్రకటించారు. యాదవ కల్యాణ మండప ఆవరణలో శనివారం ఆయనను సంఘనేతలు ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం స్వామివారి మెమెంటోను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ద్వారకాతిరుమలలో ఏ ఒక్కరికి సహాయం కావాలన్నా తన కార్యాలయ తలుపులు తెరిచే ఉంటాయని, ఎప్పుడైనా తనను కలిసి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్, ఏలూరు రుడా కార్పొరేషన్ చైర్మన్ పెద్దబోయిన శివప్రసాద్, సంఘ జిల్లా నేత ముమ్మిడి చింతయ్య, కూరాకుల బుజ్జి, రామ్మోహన్రావ్ పాల్గొన్నారు.



అంతర కళాశాలల ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ క్రీడా జట్లు

దెందులూరు, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి) : ఆల్ ఇండియా ఇంటర్ కళాశాలల ఆర్చరీ క్రీడా జట్లు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. దెందులూరు మండలం గోపన్న పాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఆదికవి నన్నయ్య వర్సిటీ రాజమహేంద్రవరం పరిధిలోని అంతర కళాశాల మధ్య ఆర్చరీ పురుషులు-మహిళల విభాగాల్లో జట్లు ఎంపిక చేశారు. టోర్నమెంట్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ మేరీ సెలన్‌రోజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ ఆధ్వర్యంలో ఎంపిక చేయగా పురుషులు, మహిళల విభాగాల్లో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మొదటి స్థానం సాధించింది. ఎంపికైన వీరు ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో డాక్టర్ అంజద్‌అలీ, గోపాలకృష్ణ ఫిజికల్ డైరెక్టర్లతో పాటు 280 మంది క్రీడాకారులు పాల్గొన్నారు

తోట సుధాకర్‌ప్రసాద్ ఆశయాలు సాధిస్తాం

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగుల కోసం, వారి హక్కుల సాధన కోసం కామ్రేడ్ సుధాకర్‌ప్రసాద్ రాజీలేని పోరాటం చేసి అసువులు బాసారని, ఆయన ఆశయాలను వారసత్వంగా తీసుకుని సాధిస్తామని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఏలూరు రెవెన్యూ అసోసియేషన్ భవన్ వద్ద సుధాకర్‌ప్రసాద్ 24వ వర్ధంతి సందర్భంగా కాంస్య విగ్రహావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రజల మన్ననలను పొందినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. కొంతమంది ఉద్యోగుల వల్ల చెడ్డపేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్లు కిందిస్థాయి ఉద్యోగులను కలుపుకుని వెళ్లాలన్నారు. ఇటీవల అధికారులు టెలీ కాన్ఫరెన్స్ వీడియో కాన్ఫరెన్స్‌లు ప్రతిరోజు నిర్వహిస్తున్నారని వారంలో ఒక్కరోజే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శక పాలన అందించాలంటే తగిన విధంగా సిబ్బందికి శిక్షణ ఇస్తే సమర్థవంతమైన పాలన అందించ వచ్చన్నారు. ఈ సందర్భంగా తోట సుధాకర్‌ప్రసాద్ జీవిత చరిత్రపై పుస్తక ఆవిష్కరణ కూడా చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కామిశెట్టి వెంకటరాజేష్, చేబ్రోలు కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు కె.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



ఏలూరులో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు



ఏలూరు-పోణంగి రోడ్డులో పూర్తికాని టిడ్కో ఇళ్లు



తాడేపల్లిగూడెంలో చిట్టడవిని తలపిస్తున్న ఫ్లాట్స్

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఆశల సౌధాలు

రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరులో టిడ్కో ఇళ్లు అందిస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో టిడ్కో గృహాలను మంజూరు చేసింది.. తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, తణుకు, ఏలూరు, జంగారెడ్డిగూడెం పట్టణాల్లో నిర్మాణాలు చేపట్టింది.. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో వాటిని వది లేసింది.. టిడ్కో అపార్ట్‌మెంట్‌ల మధ్య మొక్కలు పెరిగిపోయి భయానక వాతావరణం ఉంది. పిచ్చిమొక్కలు వేలాడుతున్నాయి. డిసెంబరులో లబ్ధిదారులకు అప్పగించనున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఇటీవల అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో టిడ్కో ఇళ్లు ఎలా ఉన్నాయి ? పేదల సొంతింటి కల సాకారమయ్యే పరిస్థితులు అక్కడ ఉన్నాయా..లేవా ? అని ఆంధ్రజ్యోతి పరిశీలించింది..

- డిసెంబరు నాటికి పూర్తయ్యే పరిస్థితి లేదు
- రంగులు మారుతున్న అపార్ట్‌మెంట్‌లు
- ఎనిమిదేళ్లుగా లబ్ధిదారుల ఆవేదన



తణుకు-అజ్జరం కాలనీలో నిర్మించిన టిడ్కో ఇళ్లు



పాలకొల్లులో..

పాలకొల్లులో శరవేగంగా పనులు

పాలకొల్లు టౌన్ (ఆంధ్రజ్యోతి): పేదలకు సొంత ఇంటి కల నెరవేరాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాల నిర్మాణం పాలకొల్లులో 7,104 గృహాల నిర్మాణాలను చేపట్టింది. వీటిలో ఇప్పటి వరకూ సుమారుగా 3 వేల మంది లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన గృహాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్లంబింగ్, సీలింగ్, విద్యుత్, తాగునీటి సరఫరా, వంటి పనులు జరుగుతున్నాయి. కొన్ని గృహాలు పూర్తి కావడంతో రంగులు వేశారు.

వసతులు సమకూర్చాలి : ఆరిమిల్లి నాగేశ్వరరావు



పాలకొల్లులో ఇప్పటి వరకూ సుమారు మూడు వేల మందికి గృహాలను అందించారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. అయితే వీధిలైట్లు పూర్తిస్థాయిలో వెలగడం లేదు, మురుగునీరు పారేందుకు మార్గం కల్పించాలి. అన్ని ఇళ్లనిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తే ఇదొక పెద్ద కాలనీ అవుతుంది.

తాడేపల్లిగూడెంలో డిసెంబరుకు కష్టమే..

తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో 5,300 మంది లబ్ధిదారులు ఇళ్ల లబ్ధి చేకూరాల్సి ఉండగా ఇప్పటికే 3,200 మందికి ఇళ్లు అందజేశారు. మిగిలిన 2 వేల కుటుంబాలకు ఫ్లాట్స్ అందించాల్సి ఉంది. గత ప్రభుత్వం ఇళ్లను పట్టించుకోకుండా వదిలేయడంతో అవన్నీ పాడైపోయాయి. మురుగు పోయే మార్గం లేదు. తలుపులు కిటికీలు చివరికి బాత్‌రూం పైపులు కూడా పగిలిపోయిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో డిసెంబరు నాటికి అందించడం కష్టమే. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఏసుబాబును వివరణ కోరగా రెండువేల మందికి ఫ్లాట్స్ అందించాల్సి ఉందని కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో వెయ్యి మందికే అందించగలమన్నారు.

మంచినీరు లేదు : దాసరి నాగేశ్వరరావు



మాకు ఆరు నెలల క్రితమే ఫ్లాట్స్ ఇచ్చారు. మా ఫ్లాట్స్ చుట్టూ తుప్పలు పెరిగి పోయాయి. మంచి నీళ్లు రావడం లేదు. అధికారులకు ఈ సమస్య చెబితే ట్యాంకులు పంపిస్తున్నారు. తుప్పల మధ్యలో ఉండాలంటే భయవేస్తోంది.,

తణుకులో నివాసయోగ్యంగా లేవు..

తణుకు (ఆంధ్రజ్యోతి) : తణుకులో ప్లాట్లు కోసం లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు. 912 గృహాలు మంజూరవగా వాటిలో అజ్జరం కాలనీ వద్ద 432, బాల బాలాజీ వద్ద 480 గృహాలు నిర్మాణాలు చేపట్టారు. అవి ప్రస్తుతం నివాస యోగ్యంగా లేవు. పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. వాటిని మళ్లీ శుభ్రం చేసి మరమ్మతులు చేయాల్సి ఉంది. పనులు చేయడానికి కాంట్రాక్టర్లను పిలిచినట్లు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు.

ఎదురు చూస్తున్నా : దాసం సుబ్బలక్ష్మి



కొన్ని సంవత్సరాలుగా సొంత కొంప కోసం ఎదురు చూస్తున్నా. రూ.75 వేలు చెల్లించి ఏడు సంవత్సరాలు అయ్యింది. గత వైసీపీ ప్రభుత్వంలో బ్యాంకు అప్పులు తీసుకున్నప్పటికి ఇళ్లు మాత్రం పూర్తి చేయలేదు. వడ్డీలు చెల్లిస్తూ, అద్దె ఇంట్లో ఉంటున్నాం.

ఎప్పుడిస్తారో తెలియదు : కొలుసు సత్యవతి



అప్పట్లో ఇల్లు కోసం రూ.25 వేలు చెల్లించాం. చాలావరకు అప్పులు చేశాం. ఇప్పటికి అద్దె ఇంట్లో ఉంటున్నాం. కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉంది. ఇప్పటికైనా ఇల్లు పూర్తి చేసి ఇవ్వాలి.

టిడ్కో ఇళ్లల్లో కనిపించని పనుల హడావిడి

ఏలూరులో పాడైన అసంపూర్తి నిర్మాణాలు

ఏలూరు టూటౌన్ (ఆంధ్రజ్యోతి): ఏలూరులో 2017లో టీడీపీ ప్రభుత్వం 6,480 టిడ్కో గృహాల నిర్మాణాలను ప్రారంభించింది. అనంతరం వచ్చిన ఎన్నికలతో నిర్మాణాలు ఆగిపోయాయి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 4,272 గృహాలు ఫౌండేషన్ స్థాయిలోనే ఉన్నాయని రద్దు చేసింది. 2208 గృహాలు 70 శాతం పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో టిడ్కోగృహాల ప్రస్తావనే లేదు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలన్ని పాడైపోయాయి. గోడలకు పగుళ్లు, వర్షాలు వస్తే స్లాబ్‌లు లీకై తడిచిపోవడం, పిచ్చిమొక్కలు అసలు లోపలకు వెళ్లడానికి వీలు లేకుండా ముళ్లపొదలతో ఉన్నాయి. ఈ గృహాల్లో విషసర్పాలు కూడా చేరుతున్నాయి. బూజుపట్టిపోయి పురాతన భవనాల్లా తయారయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఇళ్లు ఇచ్చినా ఉండగలమా అని లబ్ధిదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లోపైనా టిడ్కో గృహాలు పూర్తి చేసి అప్పగించాలని కోరుతున్నారు.

వడ్డీలకు తెచ్చి వాటా సొమ్ము కట్టాం : డి.అప్పారావు



సొంతింటి కల నెరవేరబోతుందని 2018లో రూ.50 వేలు మునిసిపల్ కమిషనర్ పేరిట చెల్లించాం. ఏడేళ్ల నుంచి వడ్డీలు కడుతూనే ఉన్నాం. సొంతింటికల మాత్రం నెరవేరడం లేదు. ఒకవైపు అసలు వడ్డీలు కడుతూ మరోవైపు ఇంటి అద్దెలు చెల్లిస్తూ అప్పులపాలవుతున్నాం. ఇప్పటికైనా టిడ్కో ఇళ్లు స్వాధీనం చేయాలి.



జంగారెడ్డిగూడెంలో నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్లు

జంగారెడ్డిగూడెంలో నిలిచిన రూ.24.33 కోట్ల పనులు

జంగారెడ్డిగూడెం (ఆంధ్రజ్యోతి) : 2018లో టీడీపీ ప్రభు త్వం అధికారంలో ఉన్నప్పుడు జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని మార్కండేయపురంలో రెండో ఫేజ్‌లో 864 ఇళ్లను మంజూరు చేసింది. దాదాపు రూ.45.86 కోట్లతో 70 శాతం పనులు పూర్తి చేశారు. మరో రూ.24.33 కోట్ల పనులు నిలిచిపోయాయి.2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పట్టించుకో కుండా పూర్తిగా వదిలేసింది. ఆరేళ్ల క్రితం అపార్ట్‌మెంట్లకు నగదు చెల్లించిన లబ్ధిదారులు తమ ఇళ్లను అప్పగించనున్నారని ప్రభుత్వం ప్రకటించడంతో సంతోషం వ్యక్తంచేస్తున్నారు. అద్దె ఇళ్లల్లో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం ఇళ్లను త్వరగా పూర్తి చేసి అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



అపార్ట్‌మెంట్‌లో చెత్తతో ఉన్న దృశ్యం

భీమవరంలో అపరిశుభ్రత..

భీమవరం టౌన్ (ఆంధ్రజ్యోతి) : భీమవరంలో ఇప్పటికే 90 శాతం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్‌ల వద్ద అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. ఈ కాలనీలో సీవరేజ్‌ట్రీట్ మెంట్ ప్లాంట్ పూర్తి అయితే తప్ప లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చే పరిస్థితి లేదు. భీమవరంలో 8,352 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటికే ఇచ్చిన 1984 మంది సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. 30 బ్లాక్‌లలో 960 ఫ్లాట్‌లు సిద్ధం అవుతున్నాయి. రెండో ఫేజ్‌లో 6,368 అపార్ట్‌మెంట్‌లు లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. డిసెంబరు నాటికి లబ్ధిదారులకు అందించాలంటే ఇప్పటి నుంచి పనులు వేగ వంతం చేస్తే అందించవచ్చు.

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పూర్తయితేనే అందజేత



కూటమి ప్రభుత్వం రంగులు వేస్తున్న దృశ్యం



ఏపీ ఆక్వా ఎగుమతిదారులతో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

'ఆంధ్రా ఆక్వా కల్చర్ దేశానికే గర్వకారణం'

భీమవరంటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ దేశానికే ఒక గర్వకారణం అని, పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందించడానికి కృషి చేస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఏపీ రాష్ట్ర ఆక్వాకల్చర్ పరిశ్రమకు చెందిన ప్రముఖ ఎగుమతిదారులతో ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్, జాకరాండా హాల్లో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఓపెన్ హౌస్ నిర్వహించి, ఎగుమతిదారులు, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై లోతుగా చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమను మరింత బలోపేతం చేయడానికి ఎగుమతులు పెంచడానికి, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడానికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. తాను కూడా ఒక ఆక్వా రైతుగా ఈ రంగంలో ఉన్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తూ కీలక భూమిక పోషిస్తున్న ఏపీకి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అవంతి ఇంద్రకుమార్, దేవి సీఫుడ్స్ తరుపు బ్రహ్మానందం, దేవి ఫిషరీస్ సూర్యనారాయణ, జగదీష్ మెరిన్ ఎక్స్‌పోర్టర్ తోట జగదీష్, ఆనంద సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్ ఆనంద జోగిరాజు, ఆక్వా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి హైకోర్టు జడ్జి పూజలు

పెదపాడు/పెదవేగి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామిని, పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి టి.మల్లికార్జున రావు కుటుంబ సమేతంగా దర్శించుకుని శనివారం పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయా దేవాలయాల్లో శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.



అభయాంజనేయస్వామి సన్నిధిలో జడ్జి మల్లికార్జునరావు దంపతులు

గజల్ శ్రీనివాస్‌కు హైకోర్టు న్యాయమూర్తి పరామర్శ



పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో గజల్ శ్రీనివాస్ మాతృమూర్తి రత్నావళి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలిసిన హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్ శనివారం పట్టణంలోని గజల్ శ్రీనివాస్, సోదరులను పరామర్శించారు. రత్నావళి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నరసాపురం కోర్టు సివిల్ జడ్జి, జూనియర్ డివిజన్ వరలక్ష్మి, సినీ సంగీత దర్శకులు వసంత్, కవి రసరాజు, పట్టణ ప్రముఖులు అడ్డాల వాసు, మేడికొండ శ్రీనివాసరావు చౌదరి తదితరులు ఉన్నారు.

ఇంటర్‌లో బోటనీ, జువాలజీలకు ఒకే పేపర్

తణుకు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):గతంలో వేర్వేరుగా ఉండే బోటనీ, జువాలజీ సబ్జెక్టులు ఈ విద్యా సంవత్సరం నుంచి కలిపి బయాలజీ పేరుతో ఒకే పేపరు నిర్వహిస్తారని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి జి.ప్రభాకర్ తెలిపారు. శనివారం తణుకు ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బోటనీ, జువాలజీ అధ్యాపకులకు ఓరియంటేషన్ కార్యక్రమం న్విహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా సబ్జెక్టులలో ఎక్కువ మార్కులు రావడానికి అధ్యాపకులు సమన్వయం చేసుకుని కృషి చేయాలన్నారు. పెంటపాడు, పాలకొల్లు అధ్యాపకులు వంశీమోహన్, నారాయణరావు, రిసోర్సుపర్సన్‌లుగా వ్యవహరించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న బోటనీ, జువాలజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యక్షా..

అసెంబ్లీ సమావేశాల్లో శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లోని పలు సమస్యలను లేవనెత్తారు. వారేమన్నారంటే..

శ్మశాన వాటికల నిర్వహణ పంచాయతీలకు అప్పగించాలి



మారిన పరిస్థితులు, గ్రామాల విస్తరణ, అభివృద్ధి జరగడం వల్ల శ్మశాన వాటికలు గ్రామాలకు చేరువై స్థలాలు లేక అనేక ఇబ్బందులున్నాయి. కొన్ని చోట్ల గ్రామాల్లో మధ్యకు వచ్చాయి. ఎవరైతే ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల్లో సమాధి చేసే సంప్రదాయంగా ఉన్నారో వారికి స్థలాలు లేక, స్థలాలు ఉన్న చోట్ల వెళ్లేందుకు మార్గాలు లేక అవస్థలు పడుతున్నారు. వీటిని మారిన పరిస్థితులకు అనుగుణంగా జనప్రాతిపదికన స్థలాలు ఇస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఉన్న చోట్ల వసతులు కల్పిస్తే అవి సంప్రదాయం ప్రకారం జరుగుతాయి. అవసరమైతే వీటి బాధ్యతలను గ్రామ పంచాయతీలు చేపట్టాలి. వీధిలైట్లు, డ్రెయినేజీలు ఎలాగైతే నిర్వహిస్తారో అదేవిధంగా శ్మశాన వాటికకు అవసరమైన వసతుల కల్పన చేయాలని కోరుకుంటున్నాను.

\- గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దొంగపిండిలో కూలిన బ్రిడ్జి నిర్మించండి



భీమవరం మండలం దొంగపిండి గ్రామంలో కాలువపై ఉన్న బ్రిడ్జి కూలి పోయింది. వెంటనే నిర్మాణం చేపట్టాలి. ఈ బ్రిడ్జి కూలిపోవడంతో ఆ గ్రామంలోని మత్స్యకారులు, విద్యార్థులు, రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి యుద్ధప్రాతిపదికన బ్రిడ్జిని పూర్తి చేయండి. మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

\- భీమవరం ఎమ్మెల్యే, పులపర్తి రామాంజనేయులు

అయ్యో.. అరటి

» పండుగ వేళ రోజురోజుకు తగ్గుతున్న ధరలు

» ఖర్చులు కూడా గిట్టడం లేదని రైతుల ఆవేదన

(తణుకు ఆంధ్రజ్యోతి)

అరటి ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా రాని దయనీయ స్థితిలో అరటి రైతాంగం ఉంది. తణుకు పరిసర ప్రాంతాలకు తణుకు మార్కెట్ కేంద్రంగా పలువురు రైతులు వాహనాలపై ఇక్కడకు తమ ఫలసాయాన్ని తెస్తుంటా రు. కొద్ది రోజులుగా అరటి ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.తణుకు, ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాల నుంచి తణుకు మార్కెట్‌కు రైతలు అరటి గెలలు తీసుకు వస్తుంటారు. అయితే కనీసం కూలి డబ్బులు కూడా రావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. చక్కెరకేళి ధరలు అంతంత మాత్రంగా ఉంది. కర్పూరం అరటి ధర అస్సలు బాగా లేదు. ఈ ప్రాంత రైతులు ఎక్కువగా ఆ రకాన్ని పండిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌కు మోటారు సైకిల్‌పై పెద్ద గెలలు ఆరు నుంచి ఏడు వరకు తెస్తున్నారు. ఆ గెలలకు రూ. వెయ్యి నుంచి 1500 రావడం కష్టంగా ఉంది. అదే చిన్న గెలలైతే వాటిని పట్టించుకునే వారే లేరు. ఆరు గెలలుకు వచ్చిన డబ్బులు మార్కెట్ సెస్, ఒక శాతం కమీషన్, కూలి పోను కేవలం రూ.500 కూడా మిగలడం లేదని రైతులు వాపోతున్నారు. ఎపుడూ ఇలాంటి పరిస్థితులు లేవని రైతులు చెబుతున్నారు.



తణుకు మార్కెట్‌కు వచ్చిన అరటి గెలలు

వాతావరణ మార్పులే కారణం..

ప్రస్తుత పరిస్థితికి వాతావరణ మార్పులే కారణంగా భావిస్తున్నారు. అధిక వర్షాలు, గాలులు లేకపోవడం, ఇపుడున్న వాతావరణం వల్ల గెలలు తొందరగా పక్వానికి రావడం కూడా నష్టానికి కారణంగా రైతులు చెబుతున్నారు.

ప్రతి రోజూ మార్కెట్..

తణుకులోని అరటి మార్కెట్ ప్రతి రోజు ఉంటుంది. ఇక్కడకు ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాల పరిధిలోని వెలగదుర్ర, తాడిపర్రు, ఉండ్రాజవరం, మోర్త, చివటం, తాడిపర్రు, సత్యవాడ, ఖండవల్లి, పెరవలి, కారకర్రు, తీపర్రు, కోరుపల్లి, పెండ్యాల వంటి గ్రామాలు నుంచి నిత్యం మోటారు సైకిళ్ళు, ఆటోలు, మినీ వ్యాన్‌లు ద్వారా ఇక్కడకు గెలలు తీసుకు వస్తుంటారు. అయితే ధరలేక రైతులు ఉసూరుమంటున్నారు.

కొనే నాథుడే లేడు



అరటి ధరలు ఏ మాత్రం బాగాలేదు. కనీసం కూలీ ఖర్చులు కూడా రావడం లేదు. కర్పూరం అయితే అసలు బాగా లేదు. కనీసం ఖర్చుల సంగతి ఎలా ఉన్న కొనే నాధుడు కూడా కనిపించడం లేదు.

\-పిండి వెంకన్న, అరటి రైతు, వెలగదుర్రు

వాతావరణం కలసి రాలేదు..



ప్రస్తుత వాతావరణంలో మార్పుల వల్ల గెలలు పక్వానికి వచ్చేశాయి. పంటంతా ఒకే సారి మార్కెట్‌కు వచ్చేయడంతో మార్కెట్ మందంగా ఉంటుంది. కనీసం ఖర్చులు కూడా రావడం లేదు. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

\-పి.రమణయ్య, అరటి రైతు, వెలగదుర్రు

రోజురోజుకు ధరల పతనం



రోజు రోజుకు ధరలు పడిపోతున్నాయి. ఖర్చులు కూడా రావడం లేదు. పంట ఖర్చుకు, మార్కెట్ ధరకు ఏ మాత్రం పొంతన లేదు. ఆర్థికంగా నష్టం వాటిల్లి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

\-ముదిగొండ శ్రీను, అరటి రైతు, వెలగదుర్రు



జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని కలిసిన డీఎస్‌వో విలియమ్స్

జీఎస్టీ సంస్కరణలు ప్రజలకు వివరించండి

ఏలూరుసిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):జీఎస్టీ సంస్కరణల వల్ల క్షేత్ర స్థాయిలో చేకూరే మేలును ప్రజలకు వివరించాలని ఏలూరు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఈబీ విలియమ్స్ కోరారు. శనివారం ఏలూరు డీఎస్‌వో ఛాంబర్‌లో చౌకడిపో డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల నిత్యావసర వస్తువులపై 0 శాతం లేదా 5 శాతం మాత్రమే పన్ను విధించారన్నారు. ప్రతి నెలా చౌక డిపో డీలర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందజేసే సమయంలో జీఎస్టీ తగ్గింపుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఏఎస్‌ఓ ప్రతాప్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన డీఎస్‌వో

జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ను శనివారం డీఎస్‌వో విలియమ్స్ మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. చైర్‌పర్సన్ నిత్యావసర సరుకులు పంపిణీ, బియ్యం నాణ్యత, మిల్లర్ల వద్ద నిల్వలు, రేషన్ దుకాణాల్లో సరఫరా వంటి అంశాలపై డీఎస్‌వోతో చర్చించారు. రాబోయే పండుగల దృష్ట్యా ముందుగానే సరుకులు నిల్వ చేసి, సకాలంలో ప్రజలకు పంపిణీ చేయాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీఏ ఆనర్స్ కోర్సు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రం ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్సు మేజర్ గ్రూపు సబ్జెక్టుగా మంజూరుచేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గత కొద్దిరోజులుగా ఉన్నతాధికారుల వద్ద చేస్తున్న అభ్యర్థనలు ఫలించాయి. ఈ మేరకు సంబందిత గ్రూపును కళాశాలకు మంజూరుచేస్తూ కళాశాలవిద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్తా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆంగ్లమాధ్యమంలో బీఏ ఆనర్స్(పొలిటికల్ సైన్సు) గ్రూపును 40 సీట్లతో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి తక్షణమే ప్రారంభించేందుకు ప్రభుత్వ అనుమతులు లభించినట్టయింది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు ధ్రువీకరించారు. విద్యార్థుల నుంచి సంబంధిత కోర్సుకు డిమాండ్ ఉండటంతో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వివరాలకు తమ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అదనపు పొగాకుతో రైతులకు లబ్ధి : ఎంపీ మహేశ్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో రైతులు అదనంగా పండించిన పొగాకు కొనుగోళ్ళ ద్వారా రైతులకు రూ.74 కోట్ల లబ్ధి చేకూరిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ అన్నారు. శనివారం జంగారెడ్డిగూడెంలోని రెండు పొగాకు వేలం కేంద్రాలను ఎంపీ మహేష్ సందర్శించారు. అనంతరం పొగాకు బోర్డు రైతుల కుటుంబాలకు చెందిన నిరుద్యోగులకు వేలం కేంద్రం ఆవరణలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ తరగతులను పరిశీలించారు. రైతులనుద్దేశించి మాట్లాడుతూ మునుపెన్నడూ లేనివిధంగా కిలో వర్జీనియా పొగాకుకు రూ.430 ధర లభించడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తున్నారన్నారు. కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ డీపీఆర్ తయారైందని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. జంగారెడ్డిగూడెంలో రైల్వే స్టాప్ ఉండేలా చూస్తానన్నారు. జీలుగుమిల్లి ప్రాంతంలో నేవీ డిపో రాకతో చుట్టు పక్కల ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతాయన్నారు. పొగాకు బోర్డు అధికారులు, కూటమి నాయకులు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న వెంకటరమణ

గరుడ ఫుడ్ కోర్టుకు టూరిజం శాఖ అవార్డు

దెందులూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారి 16పై సింగవరం వద్ద ఉన్న గరుడ ఫుడ్ కోర్టుకు బెస్ట్ వే సైడ్ అమెనిటీ అవార్డును టూరిజం శాఖ ప్రక టించింది. పర్యాటక దినోత్సవం సందర్భంగా ఫుడ్ కోర్టులో అత్యుత్తమ ఆహారం, పరిశుభ్రత గల వాష్ రూములు, పార్కింగ్ వంటి సకల సౌకర్యాలు అందిస్తుండటంతో టూరిజం శాఖ గరుడ హోటల్ అధినేత విళ్ల వెంకటరమణకు విజయవాడలో సీఎం చంద్రబాబు, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అవార్డును అందజేసింది. మొత్తం ఐదుసార్లు గరుడ ఫుడ్ కోర్టు ఈ అవార్డు దక్కించుకుంది. వెంకట రమణ మాట్లాడుతూ కొవిడ్ సమయంలో అనేక కష్టనష్టాలు ఎదురైనప్పటికీ ప్రజలకు నాణ్యమైన ఆహారం అందజేయాలన్న సంకల్పంతో అన్ని నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ హోటల్‌ను కొనసాగిస్తున్నమన్నారు. పలువురు ప్రముఖులు వెంకటరమణకు అభినందనలు తెలిపారు.

వైష్ణవి చొరవ భేష్

ముదినేపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):రాజధాని నిర్మాణానికి అన్ని వర్గాల ప్రజలు విరాళాలిచ్చేలా కృషిచేస్తున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి చొరవ అభినందనీయమని ముదినేపల్లి ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో చేయి చేయి కలుపుదాం-అమరావతిని నిర్మిద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇసుక అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టు

టి.నర్సాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ టి.ఎస్.సాయిబాబా తెలిపారు. మర్రిగూడెం పంచాయతీలోని లంకాలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఇసుక అక్రమరవాణా నివారించడానికి తెలంగాణ సరిహద్దులో లంకాలపల్లి వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ హరిబాబు, వీఆర్వోలు జెల్లా సుబాష్ చంద్రబోస్, సీతారామరాజు, పాల్గొన్నారు.

మహిళను వేధించిన యువకుడిపై కేసు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి భార్యపై దురుద్దేశంతో వేధింపులకు గురిచేసి తన మాట వినడంలేదని కులం పేరుతో దుర్భాషలాడి బెదిరింపులకు పాల్పడిన ఒక యువకుడిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. ఏలూరు వన్‌టౌన్‌కు చెందిన మహిళ తన భర్తకు రెండేళ్ల క్రితం విడాకులు ఇచ్చి ఒంటరిగా ఉంటోంది. ఏలూరుకు చెందిన పెరుమాళ్ల జనార్ధన్ తరచుగా ఆమె వద్దకు వచ్చి తాను అన్ని విధాలా చూసుకుంటానని, ఆరు కాసుల బంగారం పెడతానని తనతో సహజీవనం చేయాలని కోరాడు. ఆమె అందుకు ఇష్టపడలేదు. ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం సమయంలో ఏలూరు బంగారపు కొట్టుల రోడ్డులో ఆ మహిళ వెళ్తుండగా పెరుమాళ్ల జనార్ధన్ ఆమెకు ఎదురై వేధించాడు. కులం పేరుతో దూషించాడు. బాధితురాలు ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీసులు పెరుమాళ్ళ జనార్దన్‌పై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇల్లు ఖాళీ చేయమంటున్నారని ఆత్మహత్యాయత్నం

మొగల్తూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ స్థలంలో నిర్మించుకున్న ఇంటిని ఖాళీ చేయాలంటూ తరచూ అధికారులు వేధిస్తుండటంతో మనస్థాపానికి గురైన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మొగల్తూరు పంచాయతీ పరిధి వేగివారిపేటకు చెందిన వేగి లక్ష్మీ ఇందిరమ్మ లేఅవుట్‌లో ఇల్లు నిర్మించుకుంది. రెవెన్యూ రికార్డుల్లో ఆమె పేరులేదని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారంటూ వేగివారిపేటకు చెందిన ఒకరు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో లక్ష్మిని ఇల్లు ఖాళీ చేయాలని స్థానిక అధికారులు శుక్రవారం ఆదేశించడంతో ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. కుటుంబ సభ్యులు లక్ష్మీని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఆసుపత్రి నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

తొమ్మిది సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌లు స్వాధీనం



తణుకు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణంలో జీఎంఆర్ సిద్ధేశ్వర్ కిరణా దుకాణంలో తనిఖీల్లో భాగంగా 9 గృహావసరాల సబ్సి డీ గ్యాస్ సిలిండర్లను గుర్తించి షాపు యజమానులపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్ఐ కె.సీతారాము తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కిరణా షాపు యజమాని గుడివాడ వాసవి దుర్గరామ వెంకట నరశింహ గుప్తాను సిలిండర్ల విషయమై ప్రశ్నించగా వ్యాపార నిమిత్తం వాణిజ్య గ్యాస్ సిలండర్లు బదులుగా గృహావసరాల సిలండర్లు వాడుతున్నట్టు ఒప్పుకున్నారు. తనిఖీలలో 26వేల2 విలువ చేసే తొమ్మిటి సిలండర్లు సీజ్ చేసి కిరణా షాపు యజమాని గుడివాడ వాసవీ దుర్గ రామవెంకట నరశింహ గుప్తా పై నిత్యావరాల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు వివరించారు. తనిఖీల్లో విజిలెన్సు ఏవో జి.మీరయ్య, తణుకు సీఎస్‌డీటీ ఎన్.శ్రీదేవి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల తనిఖీలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ డి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆర్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు, స్నిఫర్ డాగ్‌లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో దసరా ఉత్సవాలు జరుగుతున్న అమ్మవారి దేవాలయాల్లో ఈ తనిఖీలు కొనసాగించారు. జిల్లాలోని రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో తనిఖీలు కొనసాగించి అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేశారు. లగేజీలను కూడా పరిశీలించారు. దసరా సెలవులు కావడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ముందస్తుగా బస్టాండ్లలో శక్తి టీమ్‌లు గస్తీ నిర్వహిస్తున్నాయి. ఎక్కడైనా ఎవరైనా అకతాయి పనులకు పాల్పడితే వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకునే నిమిత్తం కొంతమంది పోలీసులు మఫ్టీలో కూడా గస్తీ నిర్వహిస్తున్నారు. మరోవైపు ఫేస్ రికగ్నైజ్ కెమేరాలు ఉండడంతో నేరస్థులను ఇట్టే పసిగట్టేస్తున్నాయి. ఎవరైనా అనుమానాస్పదంగా మాస్క్‌లు, ముసుగులు ధరించినా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి పరిశీలిస్తున్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్లలో ప్రయాణికులకు తామున్నామంటూ శక్తిటీమ్‌లు భరోసా కల్పిస్తూ మహిళలకు, యువతులకు, బాలికలకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టారు.

● కైకలూరు: శాంతిభద్రతల కొరకు కైకలూరులో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలను నిర్వహించారు. కైకలూరు టౌన్ వెంకట్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలను చేపట్టారు. కైకలూరు ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయం పరిసరాలను, సినిమా థియేటర్లు, లాడ్జీల్లో తనిఖీలు చేశారు.



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సెల్ ఫోన్ల దొంగ అరెస్టు.. 207 ఫోన్లు స్వాధీనం

భీమవరం క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు చోరీ చేసి వేరే వ్యక్తికి విక్రయిస్తుండగా భీమవరం వన్ టౌన్ పోలీసులు చాకచక్యంగా శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 207 సెల్‌ఫోన్లు(రూ.35 లక్షల విలువ) స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వివరాలు వెల్లడించారు. ఆకివీడు పట్టణానికి చెందిన మేకల కిశోర్ ప్రస్తుతం భీమవరంలో ఉంటున్నాడు. ఆకివీడుకు చెందిన ఒక మహిళ,మరోవ్యక్తి నుంచి సెల్‌ఫోన్లు తక్కువ ధరకే కొనుగోలు చేసుకుని వాటిని పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతో భీమవరం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం జంక్షన్ రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. అతడి వద్ద రెండు ధర్మాకోల్ బాక్సులు స్వాధీనం చేసుకోగా అందులో 207 సెల్‌ఫోన్లు ఉన్నాయి. ఆకివీడుకు చెందిన నాగులూరి పెద్దింట్లు, నక్కా తరుణ్ అనే వారు సెల్‌ఫోన్లు ఇస్తున్నట్టు చెప్పాడు.200 ఫోన్లు దాటిన తర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తికి ఒక్కో సెల్‌ఫోన్ రూ.5 వేలకు విక్రయిస్తున్నట్టు విచారణలో చెప్పాడు. నక్కా తరుణ్, నాగులూరి పెద్దింట్లును, అబ్దుల్ అజీజ్‌లను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో భీమవరం డీఎస్పీ జయసూర్య, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఎస్ఐ మోహన్ వంశీ ఉన్నారు. ఈ కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐలు,ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నయీం

ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో సూపర్ శానిటేషన్



ఆస్పత్రిని శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఏలూరు క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు సోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. వాస్తవానికి వైద్యులు, సిబ్బంది సిజేరియన్లు జరిగిన బాలింతలకు కుట్లు వేసిన చోట రోజు శుభ్రపరచాల్సి ఉన్నా అలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పారిశుధ్య కార్మికులు ప్రభుత్వాసుపత్రిని శనివారం సూపర్ శానిటేషన్ పనులను చేపట్టారు. ఎంసీహెచ్ బ్లాక్‌ను పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను కూడా సూపర్ శానిటేషన్ పనులను నిర్వహించారు. బయట ప్రాంతాల్లో కూడా పరిశుభ్రపరిచి బ్లీచింగ్‌ను చల్లారు. డ్రెయిన్లను కూడా శుభ్రపరిచారు. దోమలు లేకుండా చేయడానికి పిచికారి నిర్వహించారు. సాధారణంగా 15 రోజులకు ఒకసారి ఆసుపత్రిలోని వార్డులను బూజులు కొట్టి పూర్తిగా కడగడం చేస్తూ ఉంటారు. ప్రతి రోజు మాత్రం తడి గుడ్డ పెడుతూనే ఉంటారు. ఈసారి పూర్తి స్థాయిలో కడిగేలా చర్యలను చేపట్టారు. పారిశుధ్య కార్మికులు 8 గంటలు విధి నిర్వహణలో నిమిషం తీరిక లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ వీరి జీతాలు మాత్రం పెంచడం లేదనే వేదనతోనే వారు తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడ పారిశుధ్య కార్మికులుగా బతకాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు పీఎఫ్ సొమ్ములు కూడా జమ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద కార్మికులు శనివారం అన్ని ప్రాంతాలను శుభ్రపర్చడంతో వచ్చిన రోగి బంధువులు కార్పొరేట్ ఆసుపత్రిలా కనిపిస్తుందంటూ ఆనందం వ్యక్తం చేశారు.

రిక్షా నుంచి పడి వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రిక్షాపై నుంచి ప్రమాదవశాత్తు పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఏలూరు పాములదిబ్బ ప్రాంతానికి చెందిన దాసరి చిన్న శోభనాద్రి(66) రిక్షా తొక్కుతూ ప్లాస్టిక్ సీసాలు, డబ్బాలు ఏరుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం ఉదయం ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకోవడానికి వెళ్తుండగా రిక్షా తొక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. దీంతో అతను మృతి చెందాడు.ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, నగదు చోరీ

» నిందితుడి ఫొటో విడుదల



తణుకు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):తణుకు పట్టణంలోని వారణాసి వారి వీధిలో శనివారం తెల్లవారు జామున భారీ చోరీ జరిగింది. వృద్ధురాలిని చంపుతామని బెదిరించి 50 కాసుల బంగారు ఆభరణాలు, రూ.70వేల నగదును నలుగురు దుండగులు ఎత్తుకెళ్లారు. మాజీ కౌన్సిలర్ వాకలపూడి వీర రాఘవులు భార్య కనకదుర్గ, కుటుంబ సభ్యులు వ్యాపారం నిమిత్తం ఇతర ప్రాంతంతాల్లో నివా సం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇంట్లోని కనకదుర్గ ఒక్కరే నివాసం ఉంటున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. వారణాసి వీధిలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను గుర్తించినట్టు పోలీసులు ప్రకటించారు. ఒక ఇంటి లాకర్‌ను పగలగొట్టి సుమారు 50 కాసుల బంగారు ఆభరణాలు, 70 వేల నగదును దొంగించినట్టు తెలిపారు. చోరీకి పాల్పడిన వారిలో ఇద్దరు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన నాగేంద్ర సహాని, మహారాష్ట్రకు చెందిన సందీప్ మీరాగా గుర్తించామన్నారు. నిందితుడి ఫొటోను విడుదల చేశామని, ఎక్కడైనా కనిపిస్తే వెంటనే ఎస్‌డీపీవో తాడేపల్లిగూడెం 91549 65933, ఎస్‌హెచ్‌వో తణుకు టౌన్ 94407 96640కు సమాచారం అందించాలని కోరారు.

శక్తి యాప్‌పై మహిళా కార్మికులకు అవగాహన

ఏలూరు క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణే తమ కర్తవ్యమని శక్తిటీమ్ సభ్యులు అంబికా దర్బార్ కార్మికులకు వివరించారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, నాగమణి వారి సిబ్బందితో కలిసి ఏలూరు సత్రంపాడులో ఉన్న అంబికా దర్బార్ అగరుబత్తి కంపెనీలో పనిచేసే మహిళా కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఇబ్బందులుంటే వెంటనే 112కు కాల్ చేయాలన్నారు. మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీ

దెందులూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుండుగొలను(శింగగూడెం)తిరుమల డెయిరీ ఉద్యోగుల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రపై అవగహన ర్యాలీ నిర్వహించారు. శనివారం మండలంలోని సీతంపేట, సింగగూడెం పరిధిలో తిరుమల డైరీ ప్లాంట్ మేనేజర్ రసూల్, హెచ్‌ఆర్ ప్లాంట్ మేనేజర్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సీతం పేటలో రోడ్లు శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తిరుమల డెయిరీ ఆవరణలో మొక్కలను నాటారు. క్వాలిటీ మేనేజర్ పోల్ నాయుడు, డెయిరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

ఏలూరుసిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను అక్టోబరు 1వ తేదీన పంపిణీ చేసేందుకు అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం సాయంత్రం సామాజిక పించన్లు పంపిణీ, సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని ఎంపీడీవోలకు కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. ఈనెల 30వ తేదీన బ్యాంకులకు సెలవు కారణంగా 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి ఎటువంటి ఆటంకం కలగకుండా 29వ తేదీనే పెన్షన్ల సొమ్ము మొత్తాన్ని బ్యాంకుల నుంచి తీసుకోవాలన్నారు. అనివార్య కారణాల వల్ల ఆ రోజు పింఛన్‌లు తీసుకోని వారికి అక్టోబరు 2న పంపిణీ చేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ అందించే బాధ్యత ఎంపీడీవోలపై ఉందన్నారు. జిల్లా పరిషత్ సీఈవో ఎం శ్రీహరి, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఉద్యోగ, వ్యాపారాలపై విద్యార్థినులకు అవగాహన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నాలెడ్జ్ ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో బీబీఏ, ఎంబీఏ విద్యార్థినులకు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఆధునిక మెలకువలు, సవాళ్లు అనే అంశంపై సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యను ముగించుకున్న అనంతరం విద్యార్థినులు తాము ఎంచుకున్న ఉద్యోగ, వ్యాపార రంగంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి మార్గాలపై సూచనలు చేశారు. ప్రపంచ స్థితిగతులపై బీబీఏ విద్యార్థినులు లఘునాటిక, నృత్యప్రదర్శనలతో అవగాహన కలిగించారు. వైస్‌ప్రిన్సిపాల్ సునీలారాణి, సిస్టర్ సుశీల, న్యూట్రిషన్ విభాగాధిపతి జ్యోతికుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : దూలం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దాడులకు గురైన వైసీపీ కార్యకర్తలకు అండగా నిలబడేందుకు వారికి జరిగిన అన్యాయాలను, వేధింపులను నమోదు చేసేందుకు డిజిటల్ బుక్‌ను ప్రారంభించినట్టు ఏలూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు తెలిపారు. ఏలూరులోని జిల్లా వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పేరుతో బెదిరించే వారిపై వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టపరంగా చర్యలుంటాయన్నారు. ఏలూరు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జులు మామిళ్లపల్లి జయ ప్రకాశ్, కంభం విజయరాజు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నేడు జాషువా జయంతి

ఏలూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు కవిత్వానికి పితామహుడు గుర్రం జాషువా జయంతి వేడుకలు జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిశోర్ తెలిపారు. ఏలూరు ఇజ్రాయేల్ పేటలో బాబూ జగ్జీవన్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథితో పాటు ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూర ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరీ పాటు ఏపీ ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొంటారని తెలిపారు.

జాతర అయినా స్వామి మాలలు వేసుకోవచ్చు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని తూర్పువీధి, పడమర వీధిలలో జాతర జరుగుతున్నా అయ్యప్పస్వామి, గోవింద, శివ, తదితర మాలలు వేసుకోవచ్చని పండితులు పేర్కొన్నట్టు కమిటీ అధ్యక్షులు కొట్టు మధు వెంకట్రావు తెలిపారు. రామకోటి ప్రాంగణంలో అక్టోబరు 13 నుంచి అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో స్వాములకు 50 రోజుల పాటు జరగనున్న నిత్య భిక్ష కార్యక్రమానికి సంబంధించిన రాటా పూజను శనివారం రామకోటి ప్రాంగణంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు వెంకట్రావు మాట్లాడుతూ నిత్యభిక్ష కార్యక్రమానికి సర్వ మాలధారాలు రావచ్చన్నారు. నగరంలోని ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబులతో పాటు ప్రముఖులు పూర్తిగా సహకరిస్తున్నారని చెప్పారు. ఆయన వెంట కమిటీ సహాయ కోశాధికారి కొట్టు మనోజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంతకాల సేకరణ



ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఓటరు లిస్టుల్లో అవకతవకలపై దేశవ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేక రణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నగరంలోని పలు డివిజన్లలో నిర్వహించారు. ర్యాలీ ప్రదర్శన జరిపి అనంతరం సంతకాల సేకరణ జరిపారు. కాంగ్రెస్ నాయకులు కొమ్మన సాంబ శివరావు, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, సేవాదళ్ సుబ్బారావు, నాగేంద్ర, సాల్మన్‌రాజు, ఆకుల వెంకన్న, రాటాలు, కె.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

ఆపరేషన్ ట్రేస్‌లో బాలుడి అప్పగింత

ఏలూరు క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా ఏలూరు శనివారపుపేట ప్రభుత్వ వసతి గృహంలో గత కొంతకాలంగా ఉంటున్న ఒక బాలుడి కుటుంబ సభ్యుల ఆచూకీని శక్తిటీమ్ గుర్తించింది. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగమణి, శక్తిటీమ్ సభ్యులు శనివారపుపేట వసతి గృహంలో ఉన్న ఒక బాలుడిని నుంచి శక్తిటీమ్ సభ్యులు వివరాలు తెలుసుకుని ఆ బాలుడి కుటుంబ సభ్యుల అచూకీ గుర్తించి బాలుడిని శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పీహెచ్‌సీల వైద్యులు ఆందోళన బాట!

(7వ పేజీ తరువాయి)

హెల్త్ విభాగంలో పనిచేస్తున్న వైద్యాధికారులు రిటైరయ్యేవరకు అదే కేడర్‌లో ఉండిపోతున్నారని వివరిం చారు. గిరిజన ప్రాంత పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులకు ట్రైబల్ అలవెన్స్, వెహికల్ అలవెన్స్ ప్రభుత్వం చెల్లించడం లేదని చెబుతున్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల మద్దతు : పీహెచ్‌సీల డాక్టర్ల ఆందోళనకు ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం మద్దతును ప్రకటించింది. వైద్యాధికారుల న్యాయబద్ధమైన హక్కులసాధనకు ఆందోళన/సమ్మెలో ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొంటారని ఆ సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి, జిల్లా అధ్యక్షుడు జి.ఆనందరావు, కార్యదర్శి పి.కరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

వాయుగండం .. భారీ వర్షాలు

(7వ పేజీ తరువాయి)

జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం, ఆర్‌ఆర్‌పేట, ఏలూరులో 94409 02926, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయంలో 94910 30712 నెంబర్లతో 24 గంటల పాటు 3 షిఫ్టులలో పనిచేసేలా కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. విద్యుత్ అంతరాయాలు లేదా సమస్య తలెత్తితే దగ్గరలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయానికి లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1912కు గాని ఏలూరు సర్కిల్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేస్తే సమస్య వెంటనే పరిష్కరిస్తారన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

(7వ పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోళ్ల సమస్యలు, రవాణా ఇబ్బందులు,.దాన్యం సొమ్ములు సకాలంలో అందకపోయినా తెలపవచ్చు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే జిల్లాలో ఈ-పంట నమోదు 70 శాతంకు పైగా పూర్తికాగా, ఈ-కేవైసీ 50శాతానికి పైగా పూర్తయింది. మిగిలిన వారికి పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు.

ధాన్యం మద్దతు ధర : 2025-26 ఖరీఫ్‌కు సంబంధించి వరి పంటకు ధాన్యం మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. గ్రేడ్-ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, కామన్ రకానికి క్వింటాల్‌కు రూ.2,369 చెల్లించాలని నిర్ణయించారు. గ్రేడ్ -ఏ రకం 75 కిలోల బస్తాకు రూ.1791.75, కామన్ రకం 75 కిలోల బస్తాకు రూ.1776.74 మద్దతు ధరగా చెల్లించాలని నిర్ణయించారు.

దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు

పి.శివరామమూర్తి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

గతంలో వచ్చిన ఇబ్బందులు పునరావృతం కాకుండా, దళారుల ప్రమేయం లేకుండా ఈసారి ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహిస్తాం. ఇప్పటికే 70 లక్షల గోనె సంచులను సిద్ధం చేశాం. 17శాతం లోపుగా తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ చేస్తాం.







చింతలపూడిలో లలితా దేవిగా.. చిత్రపటం స్వీకరిస్తున్న ఎంపీ మహేశ్.. కె.కోటలో కూరగాయల అలంకరణ.. ఏలూరులో వివిధ అలంకారాల్లో అమ్మవార్లు

ఘనంగా దసరా వేడుకలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో అమ్మవారి ఆలయాల వద్ద జరుగుతున్న దేవీనవరాత్రుల్లో భాగంగా శనివారం ఆరవ రోజుకు చేరుకోగా ఆలయాల్లో అమ్మవారికి శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. శుద్ధ పంచమి నేపథ్యంలో అంబికాదేవి అమ్మవారి సన్నిధిలో ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో విశేష పూజలు జరిపించి పారాయణ నిర్వహించారు. సత్రంపాడులోని స్వయంభూ శ్రీసౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో దేవీనవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి విశేష పూజలు జరిపారు. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబ అమ్మవారికి కనకదారాదేవిగా అలంకరించి దర్శనమిచ్చారు. పత్తేబాద లోని కనకదుర్గమ్మ అమ్మవారికి, సత్యనారాయణపేట లోని రేవులింగేశ్వరస్వామి ఆలయం వద్ద అమ్మవారికి లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. పవరుపేటలోని కంచి కామాక్షి పీఠంలోని అమ్మవారికి మహా చండీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి పారాయణ జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించడంతో ఆలయాల వద్ద సందడి నెలకొంది.

గంగానమ్మను దర్శించుకున్న ఎంపీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలోని గ్రామదేవత గంగానమ్మను

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు దర్శనం

ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కలగర వీర్రాజు, కార్యదర్శి కె. సురేశ్ ఎంపీ మహేష్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ మహేశ్‌ను సత్కరించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఎంపీతో పాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు

దసరా నవరాత్రి మహోత్సవాలు శనివారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. స్థానిక గంగానమ్మ అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద జరిగిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు శనివారం శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ టీవీపీ తారకం తెలిపారు. ఆలయం వద్ద అభినయ కూచిపూడి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన జరిగినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన పండు తెలిపారు.

విశేషాలంకరణలో శ్రీరాట్నాలమ్మ

పెదవేగి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారు ప్రత్యేక అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యం ప్రత్యేకపూజలు, లలితా సహస్రనామ దేవీఖడ్గమాలార్చనలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ

చింతలపూడి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ఆలయాలు అమ్మవారి పూజలతో ఆధ్యాత్మికత సంతరించుకున్నాయి. దివాణం వీధిలోని అమ్మవారి శిబిరంలో దుర్గాదేవికి శనివారం శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకరణ జరిపి పూజలు నిర్వహించారు. వేగి లింగేశ్వరస్వామి ఆలయం, విశ్వనాథ మఠం, పలు శిబిరాల్లో కూడా అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి.

కూరగాయలతో అమ్మవారికి అలంకరణ

కామవరపుకోట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో దేవీ నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ఈ మేరకు తడికలపూడిలోని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో లలితా పరమేశ్వరి కల్యాణ మహోత్సవాన్ని పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా అశేష భక్తుల సమక్షంలో జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి లలితా పారాయణ నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎంపీపీ మద్దిపోటి నాగేశ్వరరావు, సుబ్బలక్ష్మి దంపతులు, పుల్లేశ్వరరావు దంపతులు, రాఘవేంద్రరావు దంపతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నేవీ ఆయుధ డిపో నిర్మాణం ఆపేయాలి

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పవరుపేటలోని అన్నేభవన్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నిర్మాణం చేపడుతున్న నేవీ ఆయుధ డిపో నిర్మాణం వెంటనే ఆపేయాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు ఎ.రవి, బండి వెంకటేశ్వరరావు, ఎస్.రామ్మోహన్, తెల్లం దుర్గారావు, రవి, కన్నబాబు, జె.గోపి, మడకం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, రైతు సంఘం నాయకులు కె.శ్రీనివాస్, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

పెదవేగి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి అన్నారు. మండల కేంద్రం పెదవేగిలో అంగన్‌వాడీ సెక్టారు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారుల సంరక్షణకు సంబంధించి సూపర్‌వైజర్ పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటి సందర్శన చేస్తూ గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లల బరువు, ఎత్తులను సరిచూడాలని, టేక్‌హోమ్ రేషన్ అందించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

విద్యార్థులకు డీఎస్పీ రవిచంద్ర అవగాహన

లింగపాలెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్‌నేరాలపై అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు.మండలంలోని ధర్మాజీగూడెం ప్రతిభామహిళా జూనియర్ కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.నరశింహరావు ఆధ్వర్యంలో సైబర్‌నేరాల నియంత్రణ, గుడ్‌టచ్- బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ క్రాంతి కుమార్, ఎస్‌ఐ కె.వెంకన్నలు ముఖ్య అథితులుగా హాజరయ్యారు. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబర్ల(112, 181, 1098, 1930)కు కాల్ చేస్తే పోలీ తక్షణమే సంఘటనా స్థలంలో ఉంటారన్నారు. ప్రతిభా మహిళా జూనియర్ కళాశాల, శ్రీసాయి జూనియర్ కళాశాలల డైరెక్టర్, కె.సుజాతకుమారి, ప్రిన్సిపల్, రత్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్ ఆదిసత్యనారాయణ

రోడ్డు పూర్తి చేయించండి

● ఎంపీకి బోయగూడెం ప్రజల వినతి

చింతలపూడి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయగూడెం-సీతానగరం రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని వెంకటాపురం మాజీ సర్పంచ్ ఆది సత్యనారాయణ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు.నాబార్డు నిధులు రూ.20 కోట్లతో నిర్మాణం జరుగుతుందని, అయితే కొద్ది రోజులుగా పనులు నిలిపివేశారని, దీని వలన రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోందన్నారు. ప్రధానంగా బస్సులు తిరగకపోవడంతో స్త్రీశక్తి పథకంలో ఈ మార్గంలోని 11 గ్రామాల మహిళలకు ఉచిత ప్రయాణం లబ్ధి పొందలేకపోతున్నారని, రోడ్డు నిర్మాణం పూర్తయితే బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నామని వీటిని పరిశీలించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం : కమిషనర్

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏలూరును పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దుతామని నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ అన్నారు. శనివారం కమిషనర్ నగరంలో పలు ప్రాంతాల్లో సందర్శించారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అశోక్ నగర్, పత్తేబాద, తంగెళ్లమూడి, ప్రాంతాల్లో సచివాలయ శానిటరీ సెక్రటరీలతో మాట్లాడారు. నగరంలో చెత్తను సేకరించే విధానంపై ఆరా తీశారు. చెత్తను ఎప్పటికప్పుడే పోణంగి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. పారిశుధ్యం లోపిస్తే సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గన్ని

జీఎస్టీ ప్రయోజనాలు వివరించండి

భీమడోలు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కూటమి నేతలకు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం టీడీపీ నేత కరుటూరి ప్రసాద్ గృహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎస్టీ ప్రయోజనాలను గన్ని నాయకులకు వివరించారు. ఏఎంసీ చైర్మన్ శేషగిరి, కరణం పెద్దిరాజు, కుక్కల ప్రసాద్ పాల్గొన్నారు.

● భీమడోలు సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆదాము అధ్యక్షతన శనివారం ఎంపీపీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలన్నారు.



ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న సంఘ నాయకులు

అంబేడ్కర్ జీవిత చరిత్రపై నేడు నాటిక ప్రదర్శన

భీమడోలు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జీవిత గాధపై బుద్ధం శరణం గచ్ఛామి నాటిక ప్రదర్శన ఆదివారం నిర్వహిస్తున్నట్లు పూలే అంబేడ్కర్ మిషన్ తెలిపింది. ఈ మేరకు సంబంధిత కరపత్రాలను భీమడోలు ప్రధాన సెంటర్లలో ఆవిష్కరించారు. భీమడోలులో కాట్రగడ్డ కళ్యాణ మండపంలో సాయంత్రం 6 గంటలకు ఈ ప్రదర్శన జరుగుతుందని ప్రజలంతా హాజరు కావాలన్నారు.



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

కేన్సర్ బాధితురాలికి ఎల్‌వోసీ అందజేత

పెదవేగి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్‌వోసీని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అందించారు. దుగ్గిరాల కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దొండపాడుకు చెందిన కోరాడ ఆది లక్ష్మీదుర్గ కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిస్తున్న ఆది లక్ష్మీదుర్గ భర్త అశోక్ అప్పు చేసి మరీ భార్యకు చికిత్స చేయించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే చింతమనేని కేన్సర్ వ్యాధి చికిత్సకోసం సీఎం సహాయనిధి నుంచి రూ.8 లక్షలకు ఎల్‌వోసీని అందించారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు.



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తాం

పెదపాడు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):ఖాతాదారులకు నాణ్యమైన సేవలందించడంతో పాటు సొసైటీ, సంఘ సభ్యుల అభివృద్ధికి తగిన కృషి చేస్తామని పెదపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గారపాటి స్టాలిన్ తెలిపారు. పెదపాడు సొసైటీ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. పాలకవర్గం ఎన్నికైన తరువాత తొలిసారి జరిగి సర్వసభ్య సమావేశంలో చైర్మన్ స్టాలిన్ మాట్లాడుతూ ఖాతాదారులకు సరళమైన విధానంలో రుణాలు అందిస్తామన్నారు. మెంబర్లు ఖండవల్లి కాలేబు, పిల్లంగొల్ల సురేష్, సీఈవో డీవీ సుబ్బా రావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

చింతలపూడి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని డీసీహెచ్‌ఎస్ పాల్ సతీశ్ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడా రు. వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుని నిర్ధారణ అయితే తగిన మందులు వాడాలన్నారు.

మెడికల్ షాపు లైసెన్స్ రద్దు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత మందులు విక్రయించడం, రోగులకు వైద్యం అందించడంతో ద్వారకాతిరుమలలోని ఓ మందుల దుకాణాన్ని సీజ్ చేసి షాపు లైసెన్స్‌ను రద్దు చేసినట్లు జంగారెడ్డిగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబీద్ అలీ తెలిపారు. నిషేధిత మందులు విక్రయిస్తున్న కె.గణేష్ అనేవ్యక్తిని బుట్టాయగూడెంలో ఈ ఏడాది జూలైలో 4న దాడి చేసి పట్టుకున్నామన్నారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. షాపులో అబార్షన్ కిట్లు, సెక్స్ సామర్థ్యాన్ని పెంచే మందులు విక్రయిస్తున్నట్టు ఆధారాలు గుర్తించామన్నారు. ఈనెల 9న షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తూ డ్రగ్ విభాగం ఏడీ డీఎండీకే చక్రవర్తి ఆదేశాలు జారీ చేశారు. షాపు లైసెన్స్ రద్దును చాలెంజ్ చేస్తూ యజమాని హైకోర్టును ఆశ్రయించగా అతనికి చుక్కెదురైనట్టు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అలీ వివరించారు.

పదవీ యోగం కల్పించండి..

» స్థానిక సంస్థల ఎన్నికల నాటికైనా కమిటీల ఎంపిక పూర్తి చేయాలని విజ్ఞప్తులు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర కావస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల సమయం కూడా దగ్గర పడుతుంది. అయినా ఇప్పటి వరకు జంగారెడ్డిగూడెం మండలంలో టీడీపీ మండల కమిటీలు ప్రకటించడంలో జాప్యం జరుగుతోంది. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పడిన తెలుగు తమ్ముళ్లు 2024ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కష్టపడ్డారు. ప్రభుత్వం ఏర్పాటవడంతో పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో పట్టణ టీడీపీ అధ్యక్ష పదవిని భర్తీ చేశారు. అయితే ప్రధాన కార్యదర్శితో పాటు పూర్తి కమిటీని, ఇతర అనుబంధ సంఘాల కమిటీలను నేటికీ ప్రకటించలేదు. మరోపక్క దేవస్థానాల చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రంథాలయాల కమిటీ చైర్మన్లు, సభ్యులు ఇతర నామినేటెడ్ పదవులను భర్తీ చేయకపోవడంతో కార్యకర్తలు ఆశగా ఎదురు చూస్తున్నారు. 2026 ఏప్రిల్, మే లోపు స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, మున్సిపాలిటీల ఎన్నికలు పూర్తి చేసే పనిలో ఎన్నికల కమిషన్ ఉంది. ఈ లోపులోనే అన్ని పార్టీ, నామినేటెడ్ పదవుల ప్రక్రియ పూర్తి చేయాలని తెలుగు తమ్ముళ్లు కోరుతున్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నూతన యాప్ ఆవిష్కరణ

కామవరపుకోట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో మహిళా సంఘాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యాప్‌ల ద్వారా నిధులు జమ చేసుకునేందుకు అవకాశం కల్పించి మన డబ్బులు-మన లెక్కలు పేరిట యాప్‌ను శనివారం గుంటుపల్లి పంచాయతీలో సర్పంచ్ గోరింక దాసు, ఎంపీటీసీ కంఠమనేని పుష్పరాజ్యం అంజిమూర్తి, ఏపీఎం కె.ఎస్.సుబ్రహ్మణ్యం, సీపీఎస్ రంగారావు, పి.గోపి, వీవోఏఎస్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఎఫ్‌వో సతీశ్

మొక్కల పెంపకంపై డీఎఫ్‌వో ఆరా

జీలుగుమిల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పి.అంకంపాలెం ఫారెస్ట్‌లో నాటిన మారుజాతి మొక్కల ఎదుగుదలపై జిల్లా అటవీశాఖ అధికారి జి.సతీశ్ ఆరా తీశారు. బీట్‌లో సుమారు 20హెక్టార్లలో మారుజాతికి చెందిన నారవెమలి, మద్ది, వేగిస, దిరిసిన వంటి 12 రకాల మారు జాతికి చెందిన మొక్కలు నాటారు. వాటిని డీఎఫ్‌వో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిబ్బందికి సూచించారు. సంబంధిత రికార్డులు పరిశీలించారు. జంగారెడ్డిగూడెం రేంజ్ అధికారి దుర్గాకుమార్, ఎఫ్‌ఎస్‌వో కె.రాంబాబు, ఎఫ్‌బీవో జి.మారేశ్ ఉన్నారు.



ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

బాలకృష్ణపై విమర్శలు సరికాదు

కుక్కునూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు(రెడ్డిపాలెం) గ్రామానికి చెందిన బిజ్జం వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ శనివారం కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఎందరో క్యాన్సర్ బాధితులకు వైద్యం అందిస్తూ సమాజ సేవ చేస్తున్న బాలకృష్ణపై వ్యాఖ్యలు సరికాదన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పిచ్చుకరాజు, రమణరాజు, పులి శ్రీను, పుప్పాల సురేశ్, ఆర్.రమణరాజు, హరి బాబు, సూర్యం, రావి శ్రీను పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు అంబటి యశ్వంత్ ఎంపిక



ఏలూరు క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏలూరు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది అంబటి యశ్వంత్ జాతీయ అఖిల భారత న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. అక్టోబర్ 2 వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీలు శుక్రవారం న్యూ ఢిల్లీలో ప్రారంభమయ్యాయి. యశ్వంత్ ఎంపిక కావడంతో అతనిని అభినందించారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు

పోలవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ సుదర్శన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి ఎక్కువైంది. దసరా సందర్భంగా తాళ్ళపూడి, గోపాలపురం పోలవరం మండలాల నుంచి ఇతర గ్రామాల నుంచి మహిళా భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టిసీమ గ్రామానికి చెందిన జిరేశ్ దంపతులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ మహిళలు భక్తులకు పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశారు. నాలుగు వేల మంది భక్తులు ఆలయ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు శంకరమంచి వెంకట్రామ శర్మ తెలిపారు.

వాహనాల విస్తృత తనిఖీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కెపిఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో వన్‌టౌన్‌లోని అజంతాసెంటర్‌లో సీఐ సత్యనారాయణ తన సిబ్బందితో శనివారం వాహనాలు తనిఖీ చేశారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులు ఉండాలని, వాహనం నడిపేవారికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

కలపర్రు టోల్‌గేట్ వద్ద తనిఖీ..

పెదపాడు: మద్యం మత్తులో వాహనాలు నడపటం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల్లో కొన్నిసార్లు ప్రాణనష్టం కూడా జరుగుతుందని పెదపాడు ఎ.ఎస్.ఐ. గజపతిరావు అన్నారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద సిబ్బందితో కలిసి తనిఖీ చేసి హెల్మెట్ ధరించని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

కైకలూరులో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

కైకలూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కైకలూరు టౌన్ ఎస్సై వెంకట్‌కుమార్ నేతృత్వంలో కైకలూరులో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, శ్రీశ్యామలాంబ ఆలయం పరిసర ప్రాంతాలను, సినిమా థియేటర్లు, లాడ్జిల్లో తనిఖీలు చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రజల్లో భద్రతను బలోపేతం చేయడం, నేరాలను ముందస్తుగానే అరికట్టేందుకు ఈ తనిఖీలు దోహదపడతాయన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారుల సమ్మెబాట

చాట్రాయి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్త ఆందోళనలో బాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ)లో పనిచేసే వైద్యాధికారులు శనివారం నుంచి సమ్మె బాట పట్టారు. చాట్రాయి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జ్యోతి, చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తమ న్యాయమైన హక్కుల కోసం 6 రోజులు పాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు కృషి


రమణక్కపేటలో నోటి క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

మునునూరు, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): మహిళల్లో అనారోగ్య సమస్యలను నివా రించి, వారి ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నా యని డిప్యూటీ డీఎంహెచ్‌వో జాన్సీ జగన్‌మోహనరావు అన్నారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా రమణక్కపేట పీహెచ్‌సీలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. నోటి క్యాన్సర్ పరీక్షలను ఆయన స్వయంగా చేశారు. ఈ వైద్యశిబిరంలో 204మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారిని రమ్య తెలిపారు. టీడీపీ గ్రామ అధ్యక్షులు రంగు వాసు, బీజేపీ నాయకులు ఏ.క్రాంతికుమార్, ఆముదాల ఇసాక్, బడుగు శ్రీకాంత్, జనసేన నాయకులు పాశం నాగబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్ అన్నారు. శనివారం మట్టగుంటలో మూల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి నస్రీన్ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ - సశక్తి పరివార్‌లో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 190 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ అండ్రాజు రత్నమణి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో అద్దాల మండపం ప్రారంభం


చాట్రాయి అయ్యప్ప ఆలయంలో అద్దాల మండపాన్ని ప్రారంభిస్తున్న దాతలు

చాట్రాయి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి అయ్యప్ప ఆలయంలో రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన అద్దాల మండపాన్ని శనివారం దాతలు గోళ్ళ నారాయణ రావు, లక్ష్మీకుమారి దంపతులు, గోళ్ళ సుందర్ కుమార్, నాగలా వణ్య దంపతులు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని అద్దాల మండపాన్ని తిలకించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

కమిటీల ఏర్పాటు ఎప్పుడో?

పీఏసీల ఏలుబడిలోనే సంఘాలు


ముదినేపల్లి పీఏసీఎస్

ముదినేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకానికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఐదు విడతలుగా జాబితాలు విడుదల చేసినా ముదినేపల్లి మండలంలోని ఐదు సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల ఏర్పాటు పెండింగ్‌లోనే ఉంది. మండలంలో 15 పీఏసీఎస్‌లు ఉండగా, రెండు విడతలుగా పది సంఘాలకు నామినేటెడ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. మిగిలిన ఐదు సంఘాలకు గత మూడు నెలలుగా కమిటీలు ఏర్పాటు కాలేదు. మండలంలోని ముదినేపల్లి, గురజ, దాకరం, దేవపూడి, పెనుమల్లి పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకానికి సంబంధించిన పేర్ల జాబితాలు సహ కార శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వద్దే పెండింగ్‌లో ఉన్న ట్లు తెలిసింది. అభ్యర్థుల ఎంపికపై టీడీపీ నాయకుల మధ్య ఏకాభి ప్రాయం కుదరకపోవటమే కారణమని తెలుస్తున్నది. పై ఐదు సంఘాలకు ప్రతిపాదిత ఛైర్మన్ అభ్యర్థులు అందరూ తెలుగుదేశం పార్టీకి చెందిన వారే. ప్రస్తుతం ఈ ఐదు సంఘాలు ఇంకా అధికారిక పీఐసీల ఏలుబడిలోనే ఉన్నాయి.

మహిళలతో బస్సులు కిటకిట

- పలు బస్సుల్లో నిలుచునే ప్రయాణాలు
- పుణ్యక్షేత్రాలకు తరలుతున్న మహిళలు


చాట్రాయిలో విజయవాడ బస్సు వద్ద రద్దీ

చాట్రాయి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా బెజవాడ కనకదుర్గమ్మ దర్శనానికి మహిళలు భారీగా తరలివెళుతుండటంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. స్త్రీశక్తి పథకం ద్వారా కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో మండలంలో అన్ని గ్రామాల నుంచి పురుషుల ప్రయాణాలు తగ్గి మహిళల ప్రయాణాలు పెరిగాయి. ఏ బస్సులో చూసినా మహిళలే 70, 80 శాతం ఉంటున్నారు. ఎక్కువ బస్సులు స్టాండింగ్‌తో వెళుతున్నాయి. ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, నెమలి, పెనగంచిప్రోలు, జమలాపురం మొదలైన పుణ్యక్షేత్రాలకు మహిళలు వెళుతున్నారు. అలాగే నగరాల్లో ఆసుపత్రులకు, షాపింగ్‌లకు, కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్ళకు రాకపోకలు పెరగటంతో బస్సుల్లో రద్దీ బాగా పెరిగింది. ఉచిత ప్రయాణం పథకంతో ఏ పుణ్య క్షేత్రంలో అయినా మహిళా భక్తులే అధికంగా ఉండటం గమనార్హం.

ఆంధ్రా ఆక్వా కల్చర్ దేశానికే గర్వకారణం

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ


ఏపీ ఆక్వా ఎగుమతిదారులతో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరంటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) :ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ దేశానికే ఒక గర్వకారణం అని, పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందించడానికి కృషి చేస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఏపీ రాష్ట్ర ఆక్వాకల్చర్ పరిశ్రమకు చెందిన ప్రముఖ ఎగుమతిదారులతో ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్, జాకరాండా హాల్లో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఓపెన్ హౌస్ నిర్వహించి, ఎగుమతిదారులు, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై లోతుగా చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమను మరింత బలోపేతం చేయడానికి ఎగుమతులు పెంచడానికి, రైతుల ఆదాయాన్ని మెరుగు పరచడానికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అంది స్తామని హామీ ఇచ్చారు. తాను కూడా ఒక ఆక్వా రైతుగా ఈ రంగంలో ఉన్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తూ కీలక భూమిక పోషిస్తున్న ఏపీకి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అవంతి ఇంద్రకుమార్, దేవి సీఫుడ్స్ తరుపు బ్రహ్మానందం, దేవి ఫిషరీస్ సూర్యనారాయణ, జగదీష్ మెరిన్ ఎక్స్‌పోర్టర్ తోట జగదీష్, ఆనంద సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్ ఆనంద జోగిరాజు, ఆక్వా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

కైకలూరు ఎంపీడీవోగా రాజాబాబు బాధ్యతల స్వీకారం



కైకలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎంపీడీవోగా ఆర్. రాజాబాబు బాధ్యతలు చేపట్టారు. ఈయన గుడివాడ డీఎల్పీవో కార్యాలయంలో అడ్మిని స్ట్రేషన్ అధికారిగా పని చేశారు. పదోన్నతిపై కైకలూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. శనివారం మర్యాదపూర్వకంగా ఎంపీపీ అడవి కృష్ణను కలిశారు.

డిప్యూటీ ఎంపీడీవోగా అప్పారావు

కైకలూరు డిప్యూటీ ఎంపీడీవోగా జి. అప్పారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కృష్ణాజిల్లా ఉంగుటూరు గ్రేడ్-1 సెక్రటరీగా పనిచేశారు. పదోన్నతిపై కైకలూరు వచ్చారు. గతంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన కొండలరావు పదవీ విరమణ చేశారు.

పంచాయతీల విద్యుత్ బకాయిలు రూ. 14.16 కోట్లు : ఏఈ

చాట్రాయి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో గ్రామ పంచాయతీల విద్యుత్ బకాయిలు రూ. 14.16 కోట్లు పేరుకుపోయాయని, వెంటనే చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని మండల విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చాట్రాయి మండలంలో పంచాయతీల వారిగా ఉన్న బకాయిలను వివరించారు.

వైష్ణవి చౌరవ భేష్ : ఎంపీడీవో

ముదినేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణానికి అన్ని వర్గాల ప్రజలు విరాళా లిచ్చేలా కృషిచేస్తున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి చౌరవ అభినందనీయమని ముదినేపల్లి ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం చేయి చేయి కలుపుదాం- అమరావతిని నిర్మిద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోతో పాటు డిప్యూటీ ఎంపీడీవో అశోక్, మండల కార్యాలయ అధికారులు, సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు రాజధాని నిర్మాణానికి తమ వంతు విరాళాలను ఏపీ సీఆర్‌డీఏ బ్యాంక్ ఖాతాకు క్యూఆర్ కోడ్ ద్వారా పంపించారు. అనంతరం ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలను వైష్ణవి తండ్రి మనోజ్ సత్కరించారు.

'మన డబ్బులు - మన లెక్కలు' యాప్‌పై అవగాహన

ఆగిరిపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలన్నీ మన డబ్బులు - మన లెక్కలు యాప్‌లో పొందుపరిచి ఉంటాయని ఆగిరిపల్లి సీసీ జి.దివ్య అన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీకాలనీలో వీఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ బ్యాంకు రుణాలు లేదా పొదుపు సొమ్మును బ్యాంకులకు చెల్లింపులు చేస్తున్న సిబ్బంది పలుచోట్ల అవకతవకలకు పాల్పడుతున్నారని, ఈ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఈ యాప్‌ను అమల్లోకి తెచ్చిందన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

(7వ పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోళ్ల సమస్యలు, రవాణా ఇబ్బందులు,, ధాన్యం సొమ్ములు సకాలంలో అందకపోయినా తెలపవచ్చు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే జిల్లాలో ఈ-పంట నమోదు 70 శాతంకు పైగా పూర్తికాగా, ఈ-కేవైసీ 50శాతానికి పైగా పూర్తయింది. మిగిలిన వారికి పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు.

ధాన్యం మద్దతు ధర..

2025-26 ఖరీఫ్‌కు సంబంధించి వరి పంటకు ధాన్యం మద్దతు ధరను కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. గ్రేడ్-ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, కామన్ రకానికి క్వింటాల్‌కు రూ.2,369 చెల్లించాలని నిర్ణయించారు. గ్రేడ్ -ఏ రకం 75 కిలోల బస్తాకు రూ.1791.75, కామన్ రకం 75 కిలోల బస్తాకు రూ.1776.74 మద్దతు ధరగా చెల్లించాలని నిర్ణయించారు.

దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు :
పి.శివరామమూర్తి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

గతంలో వచ్చిన ఇబ్బందులు పునరావృతం కాకుండా, దళారుల ప్రమేయం లేకుండా ఈసారి ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహిస్తాం. ఇప్పటికే 70 లక్షల గోనె సంచులను సిద్ధం చేశాం. 17శాతం లోపుగా తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ చేస్తాం.

పీహెచ్‌సీల వైద్యులు ఆందోళన బాట!

(7వ పేజీ తరువాయి)

హెల్త్ విభాగంలో పనిచేస్తున్న వైద్యాధికారులు రిటైరయ్యేవరకు అదే కేడర్‌లో ఉండిపోతున్నారని వివరిం చారు. గిరిజన ప్రాంత పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులకు ట్రైబల్ అలవెన్స్, వెహికల్ అలవెన్స్ ప్రభుత్వం చెల్లించడం లేదని చెబుతున్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల మద్దతు

పీహెచ్‌సీల డాక్టర్ల ఆందోళనకు ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం మద్దతును ప్రకటించింది. వైద్యాధికారుల న్యాయబద్ధమైన హక్కులసాధనకు ఆందోళన/సమ్మెలో ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొంటారని ఆ సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి, జిల్లా అధ్యక్షుడు జి.ఆనందరావు, కార్యదర్శి పి.కరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

వాయుగుండం .. భారీ వర్షాలు

(7వ పేజీ తరువాయి)

జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం, ఆర్ఆర్‌పేట, ఏలూరులో 94409 02926, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయంలో 94910 30712 నెంబర్లతో 24 గంటలపాటు 3 షిఫ్టులలో పనిచేసేలా కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. విద్యుత్ అంతరాయాలు లేదా సమస్య తలెత్తితే దగ్గరలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయానికి లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1912కు గాని ఏలూరు సర్కిల్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్‌చేస్తే సమస్య వెంటనే పరిష్కరిస్తారన్నారు.


నూజివీడు, భాస్కరరావుపేట, వట్టిగుడిపాడులో లలితా త్రిపుర సుందరిగా అమ్మవార్లు.. కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలో పూజలు

లలితా త్రిపుర సుందరిగా అమ్మవార్ల దర్శనం

కైకలూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీచండీ మహా యాగ సహిత శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీశ్యామలాంబ అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పుష్పాలంకరణ కటాల వీర వెంకట సాయికృష్ణ, లీలా ప్రసన్న కుమారి దంపతులు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాన్ని దాతలు దోనేపూడి విష్ణుశివనాగప్రసాద్ అందజేశారు. ఉభయదాతల పూజల్లో 19 మంది దంపతులు, చండీహోమంలో 26 మంది దంపతులు పూజలు నిర్వహించారు. వారిని ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు శేషవస్త్రాలతో సత్కరించారు. సాయంత్రం కైకలూరుకు చెందిన గణేష్ మురళీ కోలాట ప్రదర్శన, తెనాలి వారిచే హరికథాగానం, కూచిపూడి నృత్య కదంబం, విజయవాడకు చెందిన సీహెచ్ అజయ్‌కుమార్ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా ఆదివారం ఏడవ రోజు శ్రీశ్యామలాంబ అమ్మవారు శ్రీసరస్వతీదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు.

●కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి చామంతిపూజ, లలితా సహస్ర కుంకుమపూజలను ఘనంగా నిర్వహించారు. ఉభయ దాతలు భుజ బలపట్నంకు చెందిన బుద్ధరాజు సుబ్రహ్మణ్యం రాజు, వాసవీశైలజ దుర్గాంబిక దంపతులు పూజలు చేశారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం దేవపూడిలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో శనివారం అమ్మవారు సంతాన లక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన దాసరి ఆంజనేయస్వామి, దాసరి గోపాలకృష్ణ, విజయవాడకు చెందిన సూరిశెట్టి బాలాజీ, దాకినీడు సత్యప్రసాద్ దంపతులు అలంకరణకు ఉభయ దాతలుగా వ్యవహరించి పూజలు చేశారు.

కలిదిండి: కోరుకొల్లు, కలిదిండి, గుర్వాయిపాలెం, భాస్కరరావుపేట గ్రామాల్లో శనివారం దుర్గమ్మ లలితా త్రిపుర సుందరి అలంకారంలో దర్శన మిచ్చారు.

నూజివీడు టౌన్: నూజివీడు సరస్వతీదేవి ఆలయంలోనూ, కోట మహిషాసుర మర్దిని ఆలయాల్లో అమ్మవార్లు లలితా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు.

ముసునూరు: బలివే శ్రీ రాజరాజేశ్వరిని గాయత్రి దేవిగా అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆగిరిపల్లి: వట్టిగుడిపాడు రామాలయంలో ప్రతిష్ఠించిన దుర్గమ్మవారు లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఆగిరిపల్లి రజక బజార్‌లోని అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.

మండవల్లి: ఇంగిలిపాకలంకలోని శివగుళకాలమ్మ లలిత త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఆముదాలపల్లి వీర బ్రహ్మం, మోరు కిషోర్ దంపతులు పూజలు చేశారు. మండలంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో విజయదుర్గాదేవి అలంకరణలో భ్రమరాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.